# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 8-4-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 217 | పేజీలు: 4 | వెల: రూ.1/-

## దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య 4421కి చేరిక

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ వేగంగా విజృంభిస్తుండటంతో కేసుల సంఖ్య క్రమంగా పెరిగిపోతున్నది. దేశ వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 254 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో దేశంలో ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల సంఖ్య 4421కి చేరింది. అలాగే దేశంలో ఇప్పటివరకు కరోనా మరణాల సంఖ్య 117గా నమోదు అయ్యింది. 326 మంది వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్ అయ్యారు. ఈ మేరకు కరోనాపై కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్తి కార్యదర్శి లవ్ అగర్వాల్ హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. సాకేంతిక పరిజ్ఞానం ఉపయోగించి క్వారంటైన్‌లో ఉన్నవారిని పర్యవేక్షిస్తు న్నామని తెలిపారు. 2500 రైల్వేకోచ్‌ల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.'కరోనా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆస్పత్రుల్లో అన్ని వైద్య సదుపాయాలు ఉన్నాయి. కరోనా సమన్వయానికి కొత్త విధానం. ముంబై, ఢిల్లీ, ఆగ్రా మురికివాడల్లో కరోనా విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భారతీయ రైల్వే 2500 కోచ్‌ల్లో 40వేల ఐసోలేషన్ బెడ్స్‌ను సిద్ధం చేసింది. టెక్నాలజీ సాయంతో క్వారంటైన్‌లో ఉన్న వారిపై నిఘా ఉంచాం. గడచిన 24 గంటల్లో మరో 8 మంది మృతి చెందగా దేశంలో ఇప్పటి వరకు కరోనా మరణాల సంఖ్య 117కు చేరింది. కోవిడ్–19 నుంచి కోలుకొని 326 మంది డిశ్చార్జ్ అయ్యారని' లవ్ అగర్వాల్ పేర్కొన్నారు.

# ఐసియూలో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్

### పరిస్థితి విషమించిందన్న సమాచారం
### బోరిస్ ఆరోగ్యంపై ట్రంప్ ఆరా
### పాలనా పగ్గాలపై ఇంగ్లండ్‌లో అనిశ్చితి

లండన్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో అతడిని ఐసియులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి సీరియస్‌గానే ఉందని సమాచారం వస్తోంది. కొన్ని రోజుల క్రితం కరోనా బారినపడ్డ జాన్సన్.. లండన్‌లోని సెయింట్ థామస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వ్యాధి తీవ్రత పెరగడంతో జాన్సన్‌ను ఐసీయూ కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బోరిస్ ఆరోగ్యం మరింత క్షీణించిందని ప్రధాని విదేశాంగ సెక్రటరీ డొమినిక్ రాబ్ వెల్లడించారు. మార్చి 27 నుంచి జాన్సన్ సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉంటున్నారు. గత ఆదివారం రాత్రి బోరిస్ కు కరోనా పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో అదేరోజు బోరిస్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం బోరిస్ జాన్సన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూకు తరలించారు. బ్రిటన్ ప్రధాని ఆరోగ్య పరిస్థితిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా స్పందించారు. బోరిస్ తనకు మంచి స్నేహితుడు అని ట్రంప్ పేర్కొన్నారు. బోరిస్‌కు మంచి వైద్యం అందేలా డాక్టర్లు చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు అన్నారు. బోరిస్ జాన్సన్ ఆరోగ్యం కొంత విషమంగా ఉందని వార్తలు రావడంతో బ్రిటన్ వాసుల్లో ఆందోళన మొదలైంది. కరోనా వైరస్ సోకిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రస్తుతం ఇంటెన్సివ్ కేర్‌లో చికిత్స పొందుతున్నారు. అయితే ఆయన తన బాధ్యతలను ఆ దేశ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డామినిక్ రాబ్‌కు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైనప్పుడు డిప్యూటీగా చేయాలని డామినిక్‌ను బోరిస్ కోరారు. పరిపాలనా సామర్థ్యాన్ని ప్రధాని కోల్పోయిన ప్పుడు ఇంచార్జ్ ఎలా దేశాన్ని నడిపిస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. నిజానికి ఇలాంటి పరిస్థితి సంభవిస్తే ఏం చేయాలన్నది అస్పష్టంగానే ఉన్నది. బ్రిటన్ రాజ్యాంగంలో దీనిపై ఎటువంటి స్పష్టతా లేదు. కాకపోతే ప్రభుత్వ పరిపాలన సాగించేందుకు కొన్ని పద్ధతులు ఉన్నాయి. క్యాబినెట్ మాన్యువల్‌ను పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ జాన్సన్ ఈ స్థితిలో పరిపాలన చేయలేనని చేతులెత్తేస్తే, అప్పుడు డామినిక్ రాబ్ ప్రభుత్వాన్ని తన కంట్రోల్‌లోకి తీసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి కొన్ని నిర్ణయాల్లో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఉదాహరణకు ఇంచార్జ్ పీఎం రాబ్.. సీనియర్ జ్యూడిసియరి నియామకాల గురించి బ్రిటన్ రాణికి ప్రతిపాదనలు చేయవచ్చు. ఇలాంటి హైర్యాంక్ పదవుల గురించి ఆయన రాణికి సలహాలు ఇవ్వొవచ్చు. కానీ పూర్తిగా స్థానచలనం చేయడం కుదరదు. కానీ క్యాబినెట్‌తో సంప్రదించిన తర్వాత ఇంచార్జ్ పీఎం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ సైనిక చర్య తీసుకోవా ల్సిన విపత్కర పరిస్థితి వస్తే, అప్పుడు ఆయన కచ్చితంగా క్యాబినెట్ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రధానులపై దాడి జరిగే అవకాశాలు ఉన్నప్పుడు, అప్పుడు న్యూక్లియర్ సబ్‌మెరైన్లకు సంబంధించిన ఆదేశాలు ఎలా ఉంటాయన్న దానిపై ఆ పీఎం రాసిన లేఖ ద్వారా స్పష్టమవుతుంది. ప్రస్తుతానికి ప్రధాని జాన్సన్ ఐసీయూలోనే ఉన్నా.. ఆయన ఆదేశాలు ఇవ్వగల స్థితిలోనే ఉన్నారు. కానీ ఆయన ప్రధానిగా తప్పుకుంటే తప్ప అన్ని కీలక నిర్ణయాలు ఇంచార్జ్ పీఎంకు బదిలీ కావు. ఒకవేళ ప్రధాని ప్రాణాలు కోల్పోతే, ఆ సమయంలో ఇంచార్జ్ పీఎంను ప్రధానిగా చేయాలని బ్రిటన్ రాణిని క్యాబినెట్ కోరే అవకాశం ఉంటుంది. కనీసం తాత్కాలిక పద్ధతిలోనైనా ఈ ప్రక్రియ జరుగుతుంది. అయితే ఇప్పుడే ఈ స్థితి మనం ఊహించలేము. జాన్సన్‌ది కానర్వేటివ్ పార్టీ. ఆ పార్టీ కొత్త నేతను ఎన్నుకునే వరకు పరిస్థితుల్లో మార్పు ఉండదు. నిజానికి ప్రధాని రాజీనామా చేసే వరకు కానీ, ఆయన ప్రాణాలు కోల్పోయే వరకు కానీ.. అధికారాలన్నీ ఆ ప్రధాని ఆధీనంలోనే ఉంటాయని ప్రభుత్వ సీనియర్లు అంటున్నారు. వాస్తవానికి రాజకీయ పార్టీలు.. యాక్టింగ్ లీడర్లను నియమిస్తాయి. కానీ యాక్టింగ్ ప్రధానులు అంటూ ఉండరని నిపుణులంటున్నారు.

# రైతు బాగుంటేనే అభివృద్ధి: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్,ఏప్రిల్ 7 : రైతు కుటుంబాలు బాగుంటేనే అభివృద్ధి.. అప్పుడే రాష్ట్రం, దేశం బాగుంటుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ మండలంలోని వేడిపల్లి గ్రామం, లక్ష్మణచాంద మండల కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అతి తక్కువ కాలంలోనే వ్యవసాయం రంగంలో అనూహ్యమైన ప్రగతిని నమోదు చేసిందన్నారు. నేడు యావత్ దేశానికి ఒక ఆదర్శవంతమైన అభివృద్ధి నమూనాను అందించిందని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో కుదేలైన వ్యవసాయం రంగం నేడు పునరుత్తేజం పొందిందని తెలిపారు. అన్నదాతలను ఆదుకునే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ను ఇస్తుందని, దీని వల్ల సుమారు రూ.7 వేల కోట్ల సబ్సిడీ భారం పడుతున్నప్పటికీ రైతన్నల మేలు కోసం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

నిర్మల్ జిల్లాలో 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న, లక్ష ఎకరాల్లో వరి సాగు అయిందన్నారు. దీనికి సుమారు రూ.850 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు నష్టపోకూడదనే ఉద్దశ్యంతో పౌరసరఫరాల శాఖ ఐకేపీ, పిఎసిఎస్, మార్కెడ్ ద్వారా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గన్ని బ్యాగుల కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. సమస్యల ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బందు సమితి కోఆర్డినేటర్ వెంకట్రాంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ , తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ విడిపోని బంధనములను
వడి వడిగా త్రెంచుఘన శివాజీ చరితన్
నుడి విన కవిగా నిలచును
"గడియారము శేష శాస్త్రి" కవితా జగతిన్ !!

(ఏప్రిల్ 7 గడియారం వేంకట శేషశాస్త్రి జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210



## హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను ఎగుమతికి అంగీకారం

### –కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ప్రాణాంతక కరోనా వైరస్ తో అల్లాడుతున్న దేశాలకు అత్యవసరమైన మందులను సరఫరా చేస్తామని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. మహమ్మారిని కట్టడి చేయడంలో సత్ఫలితాలు అందిస్తున్న పారాసిటమోల్, హైడ్రాక్సీక్లోరోక్విన్‌ను ఎగుమతి చేస్తామని పేర్కొంది. ఇప్పటికే ఈ మందులను సరఫరా చేయాలన ఇఅమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను కోరారు. ఈ విషయం కూడా కేంద్రం పరిశీలనలో ఉంది. ఈ దశలో మందులసరఫా చేసే విషయంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ ఓ ప్రకటన విడుదల చేశారు. అంటువ్యాధి ప్రబలుతున్న తరుణంలో మానవతా దృక్పథంతో పారాసిటమోల్, హైడ్రాక్సీక్లోరోక్విన్ మాత్రలను మన శక్తిసామర్థ్యాలపై ఆధారపడిన పొరుగు దేశాలకు సరఫరా చేయాలని నిర్ణయించాం. నిర్దిష్ట స్థాయిలో ఎగుమతి చేస్తాం. కరోనా కారణంగా తీవ్రంగా నష్టపోయిన దేశాలకు కూడా సహాయం అందిస్తామని, ఇందులో రాజకీయాలకు ఎటువంటి తావులేదన్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత్ అంతర్జాతీయ సమాజానికి సంఘీభావం తెలుపుతోంది. అన్ని దేశాలు పరస్పర సహాయసహకారాలు అందించుకోవాలని పేర్కొన్నారు. కాగా కరోనాను కట్టడి చేయడం కోసం ఉపయోగి స్తున్న హైడ్రాక్సీక్లోరోక్విన్ ఎగుమతులపై నిషేధం విధిస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ సహాయం కోరిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఒకవేళ భారత్ తమకు సహకరించనట్లయితే ప్రతీకారం తీర్చుకుం టామని హెచ్చరించారు. వాణిజ్య పరంగా తమ నుంచి అనేక ప్రయోజనాలు పొందిన భారత్‌తో సత్సంబంధాలు కొనసాగుతాయని ఆశిస్తున్నానని సోమవారం నాటి సమావేశంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తొలుత మందుల సరఫరాకు ససేమిరా అన్న భారత్.. మంగళవారం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## కరోనాతో లండన్‌లో భారతీయ వైద్యుడు మృతి

లండన్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): భారత సంతతికి చెందిన ప్రముఖ వైద్యుడు, హృద్రోగ నిపుణుడు డాక్టర్ జితేంద్ర కుమార్ రాథోడ్ యుూకేలో కరోనా సోకి మృతిచెందారు. బ్రిటన్ నేషనల్ హెల్త్ సర్వీసెస్‌లో ఎంతో కాలం నుంచి అసోసియేట్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ, ఎందరో ప్రముఖులకు వైద్య సేవలందించిన డాక్టర్ జితేంద్ర కుమార్ మంగళవారం ఉదయం వేల్స్ యూనివర్సిటీ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. 1977లో బాంబే యుూనివర్శిటీలో వైద్యవిద్యను అభ్యసించిన జితేంద్ర కుమార్.. ఆ తర్వాత యూకేకు వెళ్లి వైద్య రంగంలో దశాబ్దాలపాటు సేవలందించారు. తన దగ్గరికి వచ్చే రోగులకు చికిత్స అందించడంలో జితేంద్ర ఎంతో శ్రద్ధ చూపేవారని.. ఒక్కసారి ఆయన దగ్గర చికిత్స పొందిన రోగులు ఆ తర్వాత కూడా ఆయనపట్ల ఎంతో గౌరవ భావంతో ఉండేవారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. జితేంద్రకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

## కరోనాకు ఫుట్‌బాల్ ప్లేయర్ తల్లి మృతి

బార్సెలోనా,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): స్పెయిన్ మాజీ ఫుట్ బాల్ ప్లేయర్, మాంచెస్టర్ సిటీ మేనేజర్ పెప్ గార్డియోలా తల్లి కరోనాతో మృతి చెందింది. పెప్ గార్డియోలా (82)తల్లి డాలర్స్ సాలా కర్రియో బార్సెలోనా సిటీలోని మనరెసాలో తుదిశ్వాస విడిచినట్లు ప్రీమియర్ లీగ్ క్లబ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రీమియర్ లీగ్ క్లబ్‌తో ప్రతీ ఒక్కరికి మంచి అనుబంధం ఉంది. పెప్ గార్డియోలా తల్లి మరణించడం విషాదకరం. పెప్‌కు, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు మాంచెస్టర్ సిటీ క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది. పెప్ గార్డియోలా 2016లో మాంచెస్టర్ సిటీ క్లబ్ లో కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. గతంలో ఇతడు బార్సెలోనా, బేయర్న్ మ్యునిచ్‌లో కోచ్‌గా పనిచేశాడు.

# గచ్చిబౌలి స్టేడియంలో శరవేగంగా కరోనా ఆస్పత్రి

### 1500 పడకలతో సిద్ధం అవుతున్న ప్రత్యేక హాస్పిటల్
### పనుల పురోగతిని పరిశీలించిన మంత్రులు ఈటెల,కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా బాధితులకు చికిత్స చేసేందుకు వూహాన్‌లో 1000 పడకల ఆస్పత్రిని చైనా నిర్మించిన తరహాలో 1500 పడకల ఆస్పత్రిని తెలంగాణ సర్కార్ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో వైరస్ బారిన పడుతున్నవారి సంఖ్య అనూహ్యంగా పెరిగితే ఆలస్యం కాకుండా చికిత్స అందించేందుకు ముందు జాగ్రత్త చర్యగా గచ్చిబౌలీలోని స్పోర్ట్స్ సెంటర్‌ను కరోనా ఆస్పత్రిగా ప్రభుత్వం మారుస్తోంది. గచ్చిబౌలీలో కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు 1500 పడకల కోవిడ్ హాస్పిటల్ సిద్ధంగా ఉందని మంత్రి ఈటెల రాజేందర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నిబద్ధతను చూపిస్తోందని అన్నారు. మరో 22 మెడికల్ కాలేజ్ హాస్పిటల్స్‌ను కూడా పూర్తిగా కోవిడ్ హాస్పిటల్స్‌గా మార్చినట్లు ఈటెల తెలిపారు. మంగళవారం మంత్రులు కేటీఆర్, ఈటెల రాజేందర్, వైద్యాధికారులు గచ్చిబౌలీలోనీ స్పోర్ట్స్ టవర్‌లో ఏర్పాటు చేసిన హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం మొయినాబాద్ లోని భాస్కర్ మెడికల్ కళాశాల ఆస్పత్రిని సందర్శించి వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లోని అన్ని వార్డులను మంత్రి కేటీఆర్ తనిఖీ చేశారు. తెలంగాణాలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈనెల 15లోగా ప్రత్యేక కరోనా ఆసుపత్రిని సిద్ధం చేస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీకి సంబంధించిన కాంప్లెక్స్‌ను పూర్తిగా కరోనా ప్రత్యేక ఆసుపత్రిగా మార్చేందుకు పనులు శరవేగంతో కొన సాగుతున్నాయి. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఆసుపత్రి పనులను పరిశీలించారు. 15 అంతస్థుల్లో ఉన్న ఈ భవనంలో దాదాపు 1500 పడకలు అందుబాటులోకి రానున్నాయి. పనులు వేగవంతం చేసి ఈ నెల 15వ తేదీ వరకు పూర్తి చేయనున్నారు. రోజుకు దాదాపు వెయ్యి మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 364 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రోజు రోజుకు విజృంభిస్తున్న కరోనా కట్టడికి రాష్ట్రం ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది.

స్పోర్ట్స్ అథారిటీ ద్వారా సరుకుల పంపిణీ

లాక్ డౌన్ కారణంగా ఆహారం కోసం ఇబ్బంది పడుతున్న పేదలకు స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు అండగా నిలిచారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. లాక్ డౌన్ నిబంధనలు పాటించడమే ప్రజలు దేశానికి చేసే అతిపెద్ద సాయమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల నుంచి తెలంగాణకు వలస వచ్చి జీవిస్తున్న పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కరోనా మహమ్మారి ఇంకా రెండు నెలలు ఉన్నా.. తెలంగాణలో తిండికి, కూరగాయలకు ఇబ్బందిలేదని మంత్రి స్పష్టం చేశారు. రేషన్ షాపులకు వచ్చే లబ్దిదారులు కూడా సామాజిక దూరం పాటించాలని శ్రీనివాస్ గౌడ్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

దినసరికూలీలకు అన్నదానం

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో దేశంలో లాక్‌డౌన్ అమలవుతోన్న కారణంగా రోజువారి కూలీలు, వలస జీవులు, బడుగులు, సంచాలకులు తిండి దొరకని దీన పరిస్థితుల్లో ఉన్నారు. ఈ గడ్డుకాలంలో వారిని ఆదుకోవడానికి అనేక మంది ముందుకొచ్చి తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు డబ్బులు పంచుతుంటే, మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన ఫిరోజ్ ఖాన్ అనే వ్యక్తి స్వచ్ఛందం ముందుకు వచ్చారు. ఈ గడ్డు కాలంతో తిండి దొరక్క అలమటిస్తున్న సికింద్రాబాద్ ప్రాంతంలో నిరాశ్రయులకు, సంచాలకులకు పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణి చేసి మనవతను చాటుకున్నారు.




హైదరాబాద్ గచ్చిబౌలీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు ఈటెల రాజేందర్, కెటిఆర్ తదితరులు

## రష్యాలో కరోనా విజృంభణ

### ఒక్కరోజే వేయి పాజిటివ్ కేసులు నమోదు

మాస్కో,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): రష్యాలో నిన్నమొన్నటివరకు పెద్దగా కనిపించని కరోనా తాజాగా విజృంభిస్తున్నది. మంగళవారం ఒక్కరోజే వెయ్యి కేసులు నమోదయ్యాయి. దాంతో మొత్తం కరోనా కేసుల సంఖ్య 7494కు చేరింది. రష్యాలో ఇప్పటివరకు కరోనా కారనంగా 58మంది మరణించారు. వైరస్ రోజురోజుకు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో రష్యా ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టింది. అనుమానితులకు కరోనా పరీక్షలు నిర్వహించటంతోపాటు సామాజిక దూరం పాటించాలని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు.

# ధాన్యాన్ని ఆర బెట్టుకుని కొనుగోళ్ల కేంద్రాలకు తేవాలి

గజ్వేల్ , ఏప్రిల్ 7:గజ్వేల్ నియోజకవర్గంలోని రిమ్మన గూడ గ్రామంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, ఏంపీపీ, జెడ్పిటీసీ, పీఏసీఏస్ చైర్మన్, రైతు బంధు నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ... రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుంది. రైతులు బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోళ్ల కేంద్రాలకు తేవాలి. తేమ శాతం ఉంటే కొనుగోళ్లు చేయరని, దీంతో స్థలాభావ సమస్య, ఇతర రైతులకు ఇబ్బందిగా ఉంటుంది. రెండు రోజుల వరకూ రైతులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడి ఇబ్బందులు వస్తాయి.

తోటి రైతులకు ఇబ్బందులు రాకుండా, ఏ రోజు ధాన్యం ఆ రోజే కొనుగోళ్లు జరగాలంటే.. ధాన్యాన్ని ఆర బెట్టుకుని కొనుగోళ్ల కేంద్రాలకు తేవాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం. డివిజన్ ఆర్డీఓ, మండల తహశీల్దార్లు ప్రతి రోజూ కొనుగోళ్ల కేంద్రాల్లో పర్యటించి గన్నీ సంచుల కొరత, కొనుగోళ్ల కేంద్రంలో లారీలు రాకపోవడం ఇతరత్రా సమస్యలపై దృష్టి సారించాలని సమన్వయ లోపం ఉంటే సమన్వయ పర్చాల్సిన బాధ్యత ఆయా మండలాల తహశీల్దార్లదేనని సూచించారు. కరోనా వ్యాధి నివారణ చేయాలంటే.. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తికి వ్యక్తికి మధ్య సామాజిక దూరం పాటించడమే అసలైన మార్గమని, దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల వద్ద రైతులు ఒకేచోట గుమిగూడకుండా సామాజిక దూరాన్ని పాటించాలి. ప్రతి కొనుగోళ్ల కేంద్రంలో నీళు, సబ్బు, శానిటైజర్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. రైతు పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో పని చేస్తున్నది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేయని విధంగా రైతు శ్రేయస్సు కోసమే తెలంగాణ ప్రభుత్వం ఈ రకమైన ఏర్పాట్లు చేపట్టింది. రైతు సంక్షేమం కోసం ప్రతి నిమిషం ఆలోచించే ముఖ్యమంత్రి మన కేసీఆర్. క్వింటాలు రూ. 4875/– రూపాయల మద్దతు ధరతో శనగల కొనుగోళ్లు చేస్తున్నాం. దళారులు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోళ్లు చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 7770 వరి కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభిస్తున్నాం. త్వరలోనే మొక్కజొన్న, వరి, పొద్దు తిరుగుడు కొనుగోళ్ల కేంద్రాలను ప్రతి మండలాల్లో ప్రారంభిస్తాం. ఇందు కోసం రూ. 30 వేల కోట్ల రూపాయల డబ్బు కొనుగోళ్ల కోసం ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పేదవాళ్ల కోసం ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రారంభించండి. రైతులు కూరగాయలు విక్రయించేందుకు మార్కెట్ కు వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక పాసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

# కరోనాకు విరుగుడు లాక్‌డౌన్ మాత్రమే

### కఠిన నిర్ణయాలకు కట్టుబడాల్సిందే అన్న వెంకయ్య

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనాను ఎదుర్కొనేందుకు లాక్‌డౌన్ తప్ప మరో మార్గం లేదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు.

ఒకవేళ ఏప్రిల్ 14 తర్వాత లాక్‌డౌన్ పొడిగించాల్సి వచ్చినప్పటికీ ప్రజలు సంయమనంతో ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు.

రేపటి మంచి రోజుకోసం మరికొంతకాలం ఈ కష్టాలను భరిద్దాం అని అన్నారు. వచ్చేవారం చాలా కఠినమైనదని, లాక్‌డౌన్ ఎత్తివేయాలా కొనసాగించాలా అన్నది వచ్చే వారం రోజుల్లోనే నిర్ణయమవుతుందని పేర్కొన్నారు.

ఇదిలావుంటే భారత దేశంలో కరోనా కేసులు రోజు రోజుకు వివరీతం అవుతున్నాయి. ప్రస్తుతం 5 వేలకు చేరువలో ఉండడంతో ఐసీఎంఆర్ కీలక నిర్ణయం తీసుకుంది. రోజుకి లక్ష మందికి పరీక్షలు చేసే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రణాళికలు వేసుకుంటున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది. కరోనాను ఎదుర్కొనేందుకు పలు ఆవిష్కరణలకు కృషి చేస్తున్నట్లు చెప్పింది. పీసీఆర్ మిషన్ల ద్వారా పరీక్షలు జరిపేందుకు ఇప్పటికి 200 పబ్లిక్, ప్రైవేటు ల్యాబులకు అనుమతులిచ్చింది. పాజిటివ్ కేసులు ఎక్కడైతే వచ్చాయో ఆయా ప్రాంతాల్లో ప్రతీ రోజు సర్వే నిర్వహించాలని, అనుమానితులకు తప్పని సరిగా పరీక్షలు నిర్వహించాలని అధికారులు సిద్ధమవుతున్నారు. కోవిడ్ పరీక్షల కోసం ప్రభుత్వ, ప్రైవేట్‌కు చెందిన ల్యాబ్స్‌ను, రిసెర్చ్ ఇనిస్టిట్యూట్స్, మెడికల్ కాలేజీలను గుర్తిస్తున్నామన్నారు. ఏవైతే. కోవిడ్ పరీక్షలకు అనువైన ప్రాంతాలుగా ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో కరోనా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.




.హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వద్ద పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

# నిత్య పరిశోధనలు అనివార్యం..

నేటినిజం
బుధవారం 8-4-2020

ఔషధ అమ్మకాలకు ఇదివరకు మనదేశంలో విస్తృతమైన అవకాశాలు ఉండేవి. అవకాశాలు అందిపుచ్చుకునే సమయంలో బహుళజాతి సంస్థలు నిబంధనలను నిలుపుకునే స్థితిలో దారుణంగా విఫలమవుతున్నాయి. ముఖ్యంగా ఔషధ పరీక్షల నిర్వహణ పేరిట అవి పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నాయి. అయినా కేంద్రప్రభుత్వం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ ఏడాది కేంద్రం అనుమతించిన 162 పరీక్షలు జరిపే విధానాన్ని వీడియోలో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది. పకడ్బందీ చట్టాన్ని తీసుకొచ్చేంతవరకు పరీక్షలను అనుమతించవద్దని గట్టిగా సూచించింది. ఔషధ పరీక్షలు పరిశోధనలు ప్రస్తుతం దేశంలో పెద్ద వ్యాపారంగా మారాయి. దాదాపు వంద కంపెనీలకు పైగా ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. అమాయకులు నిరక్షరాస్యులనే అవి లక్ష్యంగా చేసుకుంటున్నాయి.

అమాయకులు, నిరక్షరాస్యులనే అవి లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారత్‌లో మనుషుల ప్రాణాలకు విలువ లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. పార్లమెంటరీ స్థాయీసంఘం సైతం ఈ దారుణ పరిస్థితులను తీవ్రంగా తప్పుపట్టింది. సర్కారు విధానాల్లోని లొసుగులను ఎండగట్టింది. ఇక్కడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఔషధ ఫలితాలను అమెరికా, ఐరోపా దేశాల్లో చూపిస్తూ మందులకు అనుమతులు సంపాదిస్తున్నాయి. ప్రపంచ విపణిలో అధిక ధరలకు వాటిని అమ్ముతూ లాభాలు మూటకట్టుకుంటున్నాయి.

ఇదికాక దేశంలో అంతుచిక్కని వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. వాటికి మందులు లభ్యంకాక పెద్ద సంఖ్యలో రోగులు మరణిస్తున్నారు. అందువల్లే మనదేశ వైద్యరంగంలో నిత్య పరిశోధనలు ఔషధ పరీక్షలు అనివార్యం. విదేశాల్లో విజయవంతమైన మందులు మనకు సరిపోకపోవచ్చును. గన్యా, మలేరియా, టిబీ వంటి వ్యాధులు మన దేశంలోనే ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా కొత్త ఔషధాల ఆవిష్కరణ జరగాలి. ఈ పరీక్షలన్నీ చట్టపరిధిలో మానవీయ దృక్కోణంలో నిర్వహించాలి. వాటిని వీడియో తీసేలా చట్టాన్ని సవరించాలని సుప్రీంకోర్టు సహా ఔషధ సాంకేతిక సలహా బోర్డు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ విధానం అమలులోకి వచ్చినపుడే పారదర్శకత సాధ్యపడుతుంది. మరణించిన లేదా అస్వస్థతకు గురైనవారికి ఇచ్చే పరిహారం మొత్తాన్నీ గణనీయంగా పెంచాలి. ఉచిత వైద్య సహాయం అందచేయాలి. నూతన ఔషధాల ఆమోదం, పరీక్షలు, తదితర అంశాలను పరిశీలించడానికి నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు లోగడ వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీన్ని తక్షణం ఆచరణలోకి తీసుకోవాలి. భారత వైద్య పరిశోధన మండలి రూపొందించిన జీవ వైద్య పరిశోధనలకు సంబంధించిన ముసాయిదా బిల్లును తక్షణం పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టరూపంలోకి తీసుకుని వచ్చినపుడే ఔషధ సంస్థల ఆగడాలకు, వారి చేసే అన్యాయపు వ్యాపారలకు కాస్తయినా విరామం దొరకుతుంది!!

## ధారావిలో మరో రెండు పాజిటివ్ కేసులు

### కేసుల పెరుగుదలతో మురికివాడలో కలకలం

ముంబై,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఆసియా ఖండంలోనే అతిపెద్ద మురికివాడగా పేరొందిన ముంబై ధారావీలో మంగళవారం మరో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పటివరకూ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఏడుకు చేరింది.స్థానిక అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. 80 ఏళ్లు, 49 సంవత్సరాలు ఉన్న ఇద్దరు పురుషులకు తాజాగా ఈ వైరస్ సోకినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం ఈ వైరస్ సోకిన మహిళతో వీళు కలిసి ఉన్న కారణంగానే ఆ మహమ్మారి వీరికి సోకినట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. వీరిద్దరు ధారావీలోని బాలిగా నగర్‌కు చెందిన వారిగా గురించారు. గతంలో ధారావీ నుంచి ఐదు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 56 సంవత్సాల ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 1వ తేదీన ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇప్పటికే అధికారులు ధారావీలోని బాలిగా నగర్, వైభవ్ అపార్ట్‌మెంట్, ముకుంద్ నగర్, మదీనా నగర్‌లను సీజ్ చేసింది. ధారావీలో కరోనాను అరికట్టేందుకు స్థానిక అధికారులు వీలైనంత పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఇక మహారాష్ట్రలో 748 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, 45 మంది మృతి చెందారు. 748మందిలో 56 మంది ఈ మహమ్మారితో పోరాడి గెలిచి.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

## మెహబూబా ముఫ్తీకి ఇల్లే జైలు

### –ఇంటికి తరలించిన అధికారులు

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీని తాత్కాలిక జైలు నుంచి సొంత నివాసానికి తరలించారు. అయితే అక్కడ కూడా ఆమె ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ) కింద గృహ నిర్బంధంలోనే ఉంటారని ప్రభుత్వ యంత్రాంగం ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఆగస్టు 5న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసిన సందర్భంగా మెహబూబా ముఫ్తీ సహా జమ్మూ కశ్మీర్‌లోని పలువురు రాజకీయ నేతలను ప్రభుత్వం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఆమెపై జమ్మూ కశ్మీర్ హోంశాఖ ఆమెపై పీఎస్ఏ చట్టం కింద కేసు నమోదు చేసింది. తాజాగా మౌలానా ఆజాద్ రోడ్డులోని తాత్కాలిక జైలు నుంచి ఆమె అధికారిక నివాసానికి ఆమెను తరలిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆమె నివాసానికి అనుబంధ జైలు హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## దివీస్ సాయాన్ని తిరస్కరించిన ప్రజలు

### –మంత్రి అవంతి ఇలాఖాలో ఘటన

విశాఖపట్నం,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి విస్తరిస్తుండటం.. లాక్‌డౌన్ నేపథ్యంలో పేద ప్రజలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో పలువురు ప్రముఖులు, కంపెనీలు తమ వంతుగా సాయం ప్రకటిస్తున్నాయి. ఇందులో భాగంగా.. దివీస్ ఫార్మా కంపెనీ నిత్యావసర పంపిణీ చేస్తోంది. అయితే దదివీస్ సాయాన్ని ప్రజలు తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాలో జరుగుతున్న ఈ పంపిణీ కార్యక్రమానికి వెళ్లిన మంత్రి అవంతి శ్రీనివాస్, ఎంపీ విజయసాయిరెడ్డికి చుక్కెదురైంది. అవంతి శ్రీనివాస్ సొంత నియోజక వర్గమైన భీమిలిలో ఈ ఘటన చోటుచేసుకుంది. భీమిలిలో నియోజకవర్గంలోని అన్నవరం గ్రామంలో దివీస్ కంపెనీ నిత్యావసర సరకులు పంపిణీ కార్యక్రమానికి విజయసాయి, అవంతి వెళ్లారు. అయితే దివీస్ ఇస్తున్న సరుకులను తమకు వద్దని గ్రామస్తులు తిరస్కరిస్తున్నారు. ఆ కంపెనీ వల్ల తమకు నష్టమేగానీ లాభం లేదని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఈ ఘటనతో చేసేదేమీ లేక గ్రామస్తులతో గట్టిగా మాట్లాడలేక మంత్రి, ఎంపీ ఇద్దరూ అక్కడ్నుంచి వెనుదిరిగినట్లు తెలుస్తోంది. గత రెండు మూడ్రోజులుగా విజయసాయిరెడ్డి విశాఖలోనే ఉన్నారు. సోమవారం నాడు.. మంత్రి అవంతి, విజయసాయి కలిసి ప్రగతి భారతి ఫౌండేషన్ తరపున విశాఖపట్నంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. పలువురు పారిశుధ్య కార్మికులు ఇతర వర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్‌లు పంపిణీ చేశారు.

## కరోనా భయంతో మహిళ ఆత్మహత్య

చండీఘడ్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా భయంతో ఓ మహిళ విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై స్థానిక పోలీసుల కథనం ప్రకారం పంజాబ్‌లోని ఫగ్వారా జిల్లా, ఖుర్రంపూర్ గ్రామంలో నివశించే సంతోష్ కౌర్ అనే మహిళ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దగ్గు, జ్వరం ఉండడంతో ఆమె దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. అయితే తనకు కరోనా సోకిందేమోనన్న భయం ఆమెను ఆవరించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రిమ్స్ డాక్టర్ ఇద్రిస్‌పై కేసు నమోదు

### కరోనా నెగెటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

ఆదిలాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ రిమ్స్ డాక్టర్ ఇద్రిస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. రిమ్స్ డైరెక్టర్ బలరాం నాయక్ ఫిర్యాదు మేరకు ఇద్రిస్‌పై కేసు నమోదు అయ్యింది. మర్కజ్ ప్రార్థనలకు వెళ్లి వచ్చిన విషయాన్ని ఇద్రిస్ గోప్యంగా ఉంచారు. అంతేకాకుండా ఢిల్లీ వెళ్లొచ్చిన తర్వాత రెండు వారాలపాటు విధులకు ఆయన విధులకు సైతం హాజరయ్యారు. పలువురికి ఆపరేషన్లు కూడా చేయడం గమనార్హం. ఢిల్లీ వెళ్లిన విషయం గుర్తించి ఆయనను వెంటనే ఉన్నతాధికారులు క్వారంటైన్‌కు తరలించారు. కాగా.. డాక్టర్ ఇద్రిస్‌కు కరోనా నెగెటివ్ రావడంతో వైద్యాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం డాక్టర్ ఇద్రిస్ క్వారంటైన్‌లోనే ఉన్నారు. ఇదిలావుంటే నిర్మల్ జిల్లాలో నలుగురికి కరోనా పాజిటివ్ అని తేలింది. అందరూ మర్కజ్ వెళ్లి వచ్చిన వారే కావడంతో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. జిల్లా కేంద్రంతో పాటు భైంసా, నర్సాపూర్(జి) మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు బయటకు రాకుండా కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది.

## సరుకుల రవాణాకు ఇబ్బందులు

### సరి హద్దుల మూసివేతపై సుప్రీంలో కేరళ కేసు

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనాను కట్టడి చేసేందుకు రాష్ట్రాలు తమ సరిహద్దులను మూసివేసినప్పటికీ నిత్యావసర సరుకుల రవాణాకు, అత్యవసరమైన వైద్యసేవలకు రాకపోకలను అనుమతిచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కరోనా పూర్తిగా తగ్గేవరకు తమ సరిహద్దులను తెరువబోమని కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప ప్రకటించటంతో కేరళ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అత్యవసర పరిస్థితుల్లో కేంద్రంతోపాటు రెండు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిపి అత్యవసర వైద్యం అవసరమైన రోగుల ప్రయాణానికి అనుమతిచ్చే అంశంపై ఓ నియమావళిని రూపొందించాలని ఈ నెల 3న సుప్రీం ఆదేశించింది. అయితే యడ్యూరప్ప మాత్రం సరిహద్దులు తెరిచేదిలేదని తెగేసి చెప్పటంతో కేరళ సర్కారు సుప్రీం గడప తొక్కింది. ఈ కేసును మంగళవారం విచారిస్తామని జస్టిస్ ఎన్ నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని బెంచ్ వెల్లడించింది.

# లాక్‌డౌన్‌పై కెసిఆర్ సూచనలే శ్రీరామరక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 7ఫకరోనా విజృంభణ నేపథ్యంలో చేస్తున్న యుద్ధం ఇంకా ముగియలేదు. ఎంతకాలం ఇలా యుద్ధం చేయాలో తెలియదు. ఒంటరిగానే ఎవరికి వారు యుద్ధం చేయాల్సిందే. అందుకు లాక్‌డౌన్ ఒక్కటే శ్రీరామరక్ష అని ప్రపంచమంతా గుర్తించింది.దీనిని గుర్తించినా నిర్లక్ష్యం చేసిన ఇరాన్, ఇటలీ, స్పెయిన్,అమెరికా తదితర దేశాలు భారీ మూల్యాన్ని చెల్లిస్తున్నాయి. ఇప్పటికే వేలాదిమంది మృత్యువాత పడ్డారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఐసియూలో చేరారు. ఎందరో ప్రముఖులు కరోనా బారిన పడ్డతీరు ప్రపంచం యావత్తును ఆందోళన కలిగిస్తోంది. భారత్ కూడా సరైన దిశగానే పయనిస్తున్న దశలో ఢిల్లీ మర్కజ్ ఘటన మనకు షాక్ ఇచ్చింది. ఢిల్లీ వెళ్లి వచ్చిన వారి కారణంగానే ఇప్పుడు కరోనా విజృంభణకు కారణమని తేలిపోయింది. ఈ దశలో లాక్‌డౌన్ ఎత్తేయరాదంటూ సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు లేదా హెచ్చరికలు తాజా పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. కెసిఆర్ ముందుచూపుతో చేస్తున్న హెచ్చరికగా కేంద్రం గుర్తించాల్సిందే. కెసిఆర్ అన్నట్లుగా బతికుంటే బలుసాకు తినొచ్చు..సమస్యలు తరవాత అధిగమించవచ్చు. మరింత కఠినంగా లాక్‌డౌన్‌ను అమలు చేయడంతో పాటు మరి కొన్ని రోజులు పొడిగిస్తే తప్ప దీనిని కట్టడి చేయలేం. అలాగే ఇప్పటి వరకు అదుపులోకి తీసుకున్న వారికే చికిత్స చేయడం ద్వారా కరోనాను గుర్తిస్తున్నారు. బయట తిరుగుతున్న లేదా ఇంట్లో ఉంటున్న ప్రజల్లో ఎవరికి కరోనా ఉందన్నది తెలియదు. అది ముున్ముందు తేలనుంది. తాజాగా విశాఖలో ఓ చికెన్ వ్యాపారికి కరోనా పాజిటివ్ అని తేలింది. ఇలా అతని వద్ద చికెన్ కొన్న వారంతా ఇప్పుడు ఆందోళనలో పడ్డారు. జనగామ జిల్లాలో ఓ మటన్ వ్యాపారి ఢిల్లీకి వెళ్లి రాగా అతనికి కరోనా సోకింది. దాంతో ఇప్పుడు అతని వద్ద మటన్ కొన్న వారందరిన క్వారంటైన్ చేశారు. అందుకే లాక్‌డౌన్ కఠినంగా అమలు చేస్తే తప్ప దీనిని అరికట్టలేం. ఎందుకంటే కరోనాకు వైద్యం లేదు. మందు లేదు. వాక్సిన్ లేదు. ఈ విషయం ప్రజలు గుర్తించాలి. స్వీయనియంత్రణతో సాగాలి. ఈ దశలో లాక్‌డౌన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎక్కడికక్కడ అందరినీ కట్టిపడేసిన మహమ్మారి కరోనా గుగిరించి తక్కువగా అంచనా వేస్తే సర్వనాశనం జరగగలదని ప్రపంచ అనుభవాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మహమ్మారి అంతం ఎప్పుడన్నది భవిష్యత్‌లో వచ్చే వాక్సిన్‌పై ఆధారపడి ఉంది. అంటే, ప్రతి ఒక్కరికి వైరస్‌తో పోరాడే శక్తిరావాలి. వైరస్ ఒంట్లోకి చేరినా, మన రోగనిరోధక వ్యవస్థ చేతుల్లో అది చచ్చిపోవాలి. అలా జరగాలంటే వ్యాక్సినేషన్ ప్రయోగం జరగాలి. అయితే అది ఇప్పట్లో సాధ్యం కాదు కనుక లాక్‌డౌన్ ఒక్కటే పరిష్కారం. అప్పటి దాకా మనల్ని కాపాడుకునేందుకు లాక్‌డౌన్ దానికి ఒక్కటే మార్గం.. వైరస్ వ్యాప్తితగ్గాలన్నా, దాని తీవ్రత తక్కువ కావాలన్నా ప్రతి ఒక్కరూ ఇంటి గడప దాటకూడదు. దానికి మించిన ఆయుధం, మందు లేదన్న నిజం గుర్తించిన దేశాలు జాగ్రత్త పడుతున్నాయి. కమ్యూనిటీ వ్యాప్తి జరక్కుండా ఉండాలంటే దీనిని పొడిగించాలన్న సిఎం కెసిఆర్ సూచనలు లేదా హెచ్చరికలు మనకు మార్గం కావాలి. లాక్‌డౌన్‌తో దీర్ఘకాలంలో కేసుల వ్యాప్తిని తగ్గించడమే కాకుండా,కరోనా పాజిటివ్ వ్యక్తుల కాంటాక్ట్స్‌ను గుర్తించడం, ఇప్పటికే దాని బారిన పడిన వారికి ట్రీట్‌మెంట్ చేయడం, వెంటిలేటర్లు, ఐసీయూ కేర్ యూనిట్ల వంటి హాస్పిటల్ వసతులు పెంచడం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టిపెట్టడానికి వీలుంటుంది. ఇలాంటి సందర్భాల్లోకరోనా ఎఫెక్ట్ అయిన వాళ్లనుంచి వాళకు తెలియకుండానే ఇంకొందరికి వైరస్ పాకేస్తోంది. దీంతో వైరస్ ప్రమాదకరంగా మారుతోంది. కాబట్టి అనుమానమున్న వాళ్లందరికీ టెస్టులు కచ్చితంగా చేయాల్సిందేనని నిపసుణులు అంటున్నారు. దాని వల్ల బాధితులను వెంటనే గుర్తించి ఐసోలేషన్‌లో పెట్టేందుకు అవకాశం దొరుకుతుందని చెబుతున్నారు. అంతేగాకుండా వాళ్ల కాంటాక్ట్స్‌ను తెలుసుకుని వాళ్లకూ టెస్టులు చేసి, క్వా రంటైన్ లేదా ఐసోలేషన్‌కు పంపించేందుకు వీలు చిక్కుతుందని, వైరస్ వ్యాప్తిని తగ్గించే టైం దొరుకుతుందని అంటున్నారు. లాక్‌డౌన్ లాంటి ఆంక్షలు లేకుండా వదిలేస్తే చాలా మంది వైరస్ బారిన పడే ముప్పు ఉంటుందని, మరణాలు పెరుగుతాయని సిఎం కెసిఆర్ హెచ్చరి స్తున్నారు. ఇంకెప్పుడు లాక్‌డౌన్ ఎత్తేస్తారని ఇండ్లకే పరిమితమైన చాలామంది నిట్టూరుస్తున్నారు. కానీ వారికి సమస్య తీవ్రత అర్థం కావడం లేదు. కేసులు పెరుగుతున్న ఇలాంటి సమయంలో లాక్‌డౌన్ ఎత్తేయడమంటే ముప్పును కొనితెచ్చుకోవడమే తప్ప మరోటి కాదు. ప్రపంచంలోని అనేక దేశాలు ముప్పును గుర్తించి లాక్‌డౌన్‌ను చాలా కఠినంగా అమలు చేస్తున్నారు. అందుకే ఇప్పుడు అక్కడ కేసులు తగ్గుతున్నాయని చెబుతున్నారు. అందుకే మరో వారం పది రోజులు లేదా మరికొంత కాలం లాక్‌డౌన్ అమలు చేస్తే ఆర్థికంగా మన వ్యవస్థను తరవాత సరిదిద్దుకోవచ్చని కెసిఆర్ చేసిన ప్రకటన దరిమిలా ఇప్పుడు చర్చ సాగాలి. ఆ మేరకు లాక్‌డౌన్‌పై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలి. వ్యాక్సిన్ తయారీకి ఎంత లేదన్నా కనీసం ఏడాదిన్నర పడుతుందని కంపెనీలు చెబుతున్నాయి. అంత తొందరగా వ్యాక్సిన్ వచ్చినా ఆశ్చర్యమేనని నిపుణులు అంటున్నారు. ఒక వ్యాక్సిన్ తయారై మార్కెట్లోకి రావాలంటే సంవత్సరాలు పడుతుందని చెబుతున్నారు. అయితే, ఆ పరిస్థితి రాకుండా సైంటిస్టులు కొత్త టెక్నాలజీలను వాడుకుంటూ వ్యాక్సిన్లు తయారు చేస్తున్నారు. అప్పటి వరకు సామాజిక దూరం పాటిస్తే ప్రణాలు కాపాడుకోవచ్చు. రోడ్లపైకి వచ్చిన వాళ్లు సోషల్ డిస్టెన్సింగ్ పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పటి దాకా స్కూళ్లు, ఆఫీసులను తెరవకపోవడమే ఉత్తమం.

# జిల్లాలో పెరుగుతున్న కరోనా కేసులు

### జిల్లా అంతటా హై అలర్ట్ విధించిన పోలీసులు

### లాక్‌డౌన్ ఎత్తివేతపై ప్రజల్లో సర్వత్రా ఉత్కంఠ

ఆదిలాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకు మరింత ఎక్కువగా పెరుగుతుం డటంతో ఆదిలాబాద్ జిల్లాలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. కరోనా ప్రభావిత ప్రాంతాల్లో పూర్తిస్థాయి లాక్‌డౌన్‌ను అమలు చేశారు. జిల్లా కేంద్రంలో మొత్తం 19 ప్రభావిత వార్డులను అధికారులు గుర్తించారు. నేరెడుగొండ మండల కేంద్రంపాటు సమీపంలోని రెండు గ్రామాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉట్నూర్ మండలంలోని హాసనాపూర్ సహా 5 గ్రామాలను సైతం ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. దీంతో ప్రస్తుతం వైద్య బృందాలు ఆయా ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే రాబోయే 9 రోజులు కీలకంగా మారాయనే చెప్పాలి. జిల్లాల్లో కూడా సరిహద్దులను మూసివేశారు. గ్రామాల్లోకి కొత్తవారిని రానివ్వకుండా కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. కరోనా లక్షణాలు బయటపడాలంటే 14 రోజుల సమయం పడుతుంది. అయితే ఈలోపు కొత్తగా ఎవరికైనా కరోనా సోకితే ఈ నెల 10లోపు బయటపడే అవకాశాలు ఉన్నాయి. లాక్‌డౌన్ ముగిసే 14వ తేదీలోపు దేశంలో కరోనా ప్రభావం ఎంత అన్నది ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఢిల్లీ మర్కజ్ నుంచి రాష్ట్రంలోకి మార్చి 19 వరకు వచ్చారు. వారి నుంచి ఎంత మందికి కరోనా సోకిందన్నది 10వ తేదీలోపు తెలిపోయే అవకాశం ఉంది. అందుకే 10వ తేదీ డెడ్ లైన్‌గా భావించవచ్చునని నిపుణులు అంటున్నారు. ? అప్పటి వరకు కరోనా మహమ్మారి అదుపులోకి వస్తుందా అన్నదానిపైనే అంతటా చర్చ జరుగుతోంది. మరోవైపు దేశంలో కరోనా కేసులు అంతకంతకు పెరుగుతున్నాయి. లాక్‌డౌన్ ప్రకటించే సమయానికి వందల సంఖ్యలో ఉన్న కేసులు ఒక్కసారిగా 4 వేలకుపైగా చేరాయి. మిగతా దేశాలతో పోల్చి చూస్తే కరోనా ఉధృతి భారత దేశంలో తక్కువగా ఉందని చెప్పవచ్చు. ఇదంతా లాక్ డౌన్ ప్రభావమేనని నిపుణులు అంటున్నారు. లాక్‌డౌన్‌తో దేశవ్యాప్తంగా విమానాలు, రైళ్లు, బస్సులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. ఇక మరో వారంలో లాక్ డౌన్ ముగియనుంది. అయితే లాక్ డౌన్ పొడిగింపుపై కేంద్రం స్పష్టమైన సంకేతాలు ఇవ్వలేదు. దశలవారీగా లాక్ డౌన్ ఎత్తివేస్తారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఏప్రిల్ 14న ఏం జరగబోతోందన్న సస్పెన్స్ ప్రజల్లో నెలకొంది.

# హైడ్రాక్సీక్లోరోక్విన్ ఎగుమతిపై పునరాలోచన

### ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో త్వరలో నిర్ణయం

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): మలేరియా నివారణకు ఉపయోగించే హైడ్రాక్సీక్లోరోక్విన్ ఎగుమతిపై విధించిన ఆంక్షలను భారత్‌కు పాక్షికంగా ఎత్తివేయనుంది. దేశంలో కరోనా వైరస్ విస్తరిస్తుండటంతో దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్చి 25న క్లోరోక్విన్, పారాసిటమాల్ ఔషధాల ఎగుమతిపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే కరోనా వ్యాధిని నయం చేయడానికి క్లోరోక్విన్ ట్యా÷–లబెట్‌ను పరిష్కారంగా ఉపయోగిస్తుండటంతో ప్రపంచ దేశాల నుంచి తమకు పంపిణీ చేయాలని డిమాండ్ అధికంగా వస్తున్నది.

అయితే దేశీయ అవసరాలను పరిగణలోకి తీసుకుని, ప్రజలకు తగినతంగా వాటిని అందుబాటులో ఉండేలా చూసిన తర్వాత క్లోరోక్విన్ ట్యా÷–లబెట్లను విదేశాలకు ఎగుమతిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంచి. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు తమ దేశానికి క్లోరోక్విన్ ట్యా÷–లబెట్లను ఎగుమతి చేయాలని ప్రధాని మోదీని కోరిన విషయం తెలిసిందే. అయితే అమెరికాలో కరోనా విజృంభిస్తున్న తరుణంలో హైడ్రాక్సీక్లోరోక్విన్ మెడిసిన్‌ను భారత్ తమకు పంపని పక్షంలో ప్రతీకారం తీర్చుకుంటామని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మలేరియా నివారణకు ఉపయోగిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందును ఇప్పుడు కోరనా వైరస్ నివారణకు ఉపయోగిస్తుండటంతో... ఆ మందుల ఎగుమతు లపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఐతే... అమెరికాకు అవసరమయ్యే హైడ్రాక్సీ క్లోరోక్విన్‌లో సగం భారత్ నుంచే ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు భారత్ ఈ నిర్ణయం తీసుకోవడంతో... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చాలా ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

తమ దేశంలో కరోనా వైరస్ పెరిగిపోతున్న సమయంలో... ప్రధాని మోదీని హైడ్రాక్సీ క్లోరోక్విన్ కోసం ఫోన్ కాల్ ద్వారా రిక్వెస్ట్ చేసిన ట్రంప్, ఆ ప్రతిపాదన ఫలించకపోవడంతో... ఇండియాపై వాణిజ్య అంశాల్లో ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటు న్నట్లుగా సమాచారం. కరోనా తగ్గిన తర్వాత ట్రంప్... భారత్‌పై భారీగా వాణిజ్యం సుంకాలు వేస్తారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే అమెరికాకు డ్రగ్ సరఫరా కొనసాగించాలా వద్దా... అనే అంశంపై భారత్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ట్రంప్ తనకు కాల్ చేసినప్పుడు మాత్రం మోదీ...మేం చేయగలిగింది చేస్తామని మాత్రమే చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో పెరిగిపోతున్న కరోనా వైరస్‌ని అదుపు చెయ్యలేకపోతున్న ట్రంప్... భారత్ లాంటి దేశాల్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కరోనాను సమర్థంగా కంట్రోల్ చేస్తున్న ఇండియాకి ప్రపంచ దేశాల మద్దతు లభిస్తోంది.



నిత్యం పూజలు చేసుకుని బతికే బ్రాహ్మణులు లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోవడంతో వారికి నిత్యావసరాలు పంపిణీ చేసిన మౌలాలీకి చెందిన శ్రీరామానుజసేవాట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ ధనుంజయ్

## స్కూళ్లకు ఇక జూన్ వరకు సెలవులు

### త్వరలోనే సమీక్షించనున్న సిఎం జగన్

అమరావతి,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా రోజురోజుకూ విజృంభిస్తున్న నేపథ్యంలో పాఠశాలలు ఇప్పట్లో తెరుచుకునే అవకాశం కనిపించడంలేదు. లాక్‌డౌన్ కారణంగా ఈ నెల 14 వరకు ప్రభుత్వం స్కూళ్లకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 15 నుంచి లాక్‌డౌన్ ఎత్తివేసినా లేదా సడలించినా పాఠశాలలు మాత్రం వేసవి సెలవుల వరకు మూత అనివార్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై త్వరలోనే ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అంటున్నారు. ఇప్పటికే1నుంచి 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు లేకుండానే పై తరగతులకు ప్రమోషన్ కల్పించారు. అయితే కరోనా ఇంకా కంట్రోల్ కాకపోవడంతో విద్యాసంవత్సరం మరింత ఆలస్యం కానుంది. దేశంలో కేంద్రం అనుసరించే విధానం మేరకు చర్యలు తసీఉకునే అవకాశం ఉంది. స్కూళ్లు తెరిస్తే విద్యార్థులు గుంపులు గుంపులుగా చేరటం, ఫలితంగా సామాజిక దూరానికి విఘాతం కలుగుతుంది. అందువల్ల ఇటువంటి పరిస్థితి రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇప్పటికే ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించకుండా ఆల్ పాస్ ఉత్తర్వులు ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు కూడా వాయిదా వేశారు. విద్యా విషయక క్యాలెండర్ ప్రకారం ఈ నెల 23 వరకు స్కూళ్లు పని చేస్తాయి. 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి. ఈ నెల 14 తరువాత ఈ విద్యా సంవత్సరంలో ఆదివారాలు పోనూ ఇంకా 7 పనిదినాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. తాజా పరిస్థితుల్లో ఈ కొద్ది రోజులు స్కూళ్లు తెరిపించినా ఒనకూరే ప్రయోజనం ఏమీ లేదని భావిస్తున్నారు. ఒకేసారి వేసవి సెలవుల వరకు అంటే జూన్ 11వ తేదీ వరకు స్కూళ్లు మూత తప్పదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

## అమెరికాలో జర్నలిస్ట్ కూచిభొట్ల మృతి

### కరోనాతో పోరాడి ఓడిన ఎన్నారై

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఇండో అమెరికాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ బ్రహ్మ కంచిభొట్ల (66) కరోనా వైరస్ బారిన పడి చనిపోయారు. సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు వారి కొడుకు సుధామ కంచిభొట్ల తెలిపారు. అయితే ఆయన తొమ్మిదిరోజుల నుంచి హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్నట్లు చెప్పారు సుధామ. బ్రహ్మ కంచిభొట్ల యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియాకు కరెస్పాండెంట్‌గా వ్యవహరించారు. అమెరికాలో జర్నలిస్ట్ గా 28సంవత్సరాలు పనిచేశారు. దీంతో పాటు మెర్జర్ మార్కెట్స్ అన్డే ÷నాన్సియల్ పబ్లికేషన్‌కు 11సంవత్సరాలు కంటెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. దీంతో పాటు న్యూస్ ఇండియా–టైమ్స్ వీక్లీ న్యూస్ పేపర్‌కు కూడా తన సేవలను అందించారు. బ్రహ్మ 1992వరకు భారత్‌లోనే జర్నలిస్ట్‌గా పనిచేసి? ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లారు. ప్రస్తుతం అమెరికాలో కరోనా విజృంభిస్తున్నందువలన బ్రహ్మ కంచిభొట్ల అంత్యక్రియలకు కేవలం 10మందికి మాత్రమే అనుమతులు ఉన్నాయని సుధామ చెప్పారు. మార్చ్23న తన తండ్రి బ్రహ్మ కంచిభొట్లకు కరోనా లక్షణాలు బయటపడ్డాయని చెప్పారు. దీంతో డాక్టర్లు చికిత్సను మొదలు పెట్టారని మార్చ్ 28నాటికి పరిస్థితులు చేయి దాటి పోతుండటంతో లాంగ్ ఐలాండ్ అనే హాస్పిటల్‌లో చేర్పించామని.. అప్పటినుంచి బ్రహ్మ కంచిభొట్లను వెంటిలేటర్‌పైనే ఉంచారని చెప్పారు. అయితే సోమవారం కార్డియాక్ అరెస్ట్ అయిందని దీంతో బ్రహ్మ కంచిభొట్ల చనిపోయారని తెలిపారు. బ్రహ్మ కంచిభొట్లకు భార్య అంజనా, కొడుకు సుధామ, కూతురు సియుజనా ఉన్నారు.

## రొట్టెలోకి నూనే లేదు..ఇక దీపాలు ఎలా వెలిగిస్తారు

### –ప్రధాని మోడీకి కమల్‌హాసన్ బహరంగ లేఖ

చెన్నై,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఏప్రిల్ 5 న ప్రతి ఒక్కరు ఇంటి ముందు దీపం వెలిగించాలని మోడి కోరడాన్ని మక్కల్ నీదిమయ్యమ్ అధ్యక్షుడు కమల్ హాసన్ కొంచెం ఆలస్యంగా స్పందించారు. తాజాగా 21 రోజుల లాక్‌డౌన్‌ని విమర్శిస్తూ మోడికి బహిరంగలేఖ రాశారు. లాక్‌డౌన్ వల్ల బడుగులు, పేదవారు ఎంతగానో నష్టపోతున్నారని, డిమానిటైజేషన్ కన్నా దీని ప్రభావం వారిపై ఎక్కువగా ఉందని కమల్ లేఖలో పేర్కొన్నారు. మొదట, మీరు దేశం ఎంచుకున్న నాయకుడని, మీతో సహా 1.4 బిలియన్ల భారతీయులు ఈ సంక్షోభ సమయంలో ఉన్నారని గుర్తించాలి. చప్పట్లు కొట్టమన్నప్పుడు, లైట్లు వెలిగించమన్నప్పుడు అందరు మీతో నడిచారు. నాయకుడిగా మీ వెంట మేం ఉంటాం. కాని దేశంలో చాలా మంది తిండి తిప్పలు లేక , వేరే ప్రాంతాలలో ఇరుక్కుపోయి బిక్కుబిక్కుమంటూ జీవితాన్ని గడుపుతున్నారు. మీరు నూనెతో దీపాలు వెలిగించమంటున్నారు. కాని రోటీ చేసుకోవడానికి కావలసిన నూనె లేక వారు చాలా ఇబ్బంది పడుతున్నారనే విషయం గమనించాలని అన్నారు. దాదాపు మీ నిర్ణయాలన్నీ మిడిల్ క్లాస్ ప్రజలని సంతోష పెట్టేవిగా ఉంటాయి. ఇలాంటి విపత్కాల సమయంలో పేదవారి సమస్యలు అర్థం చేసుకోవాలి. వారు మనదేశ ప్రగతికి ఎంత సహకారాన్ని అందిస్తున్నారనే విషయం మరచిపోకూడదు. ధనికుడు ఎలాగోలా పొట్టనింపుకుంటాడు. కాని పేదవాడి గురించి మాట్లాడేవాడే ఉండడు. దేశంలో మెజారిటీ వాటా వారిదే. అట్టడుగు స్థానంలో ఉన్న వారిని నాశనం చేయడానికి చేసే ప్రయత్నాలు ఏవైనా అగ్రస్థానాన్ని పడగొట్ట డానికి దారితీశాయని చరిత్ర రుజువు చేసిన విషయం తెలిసిందే అన్నారు.

మధ్య తరగతి వారినే కాకుండా అణగారిన వర్గాల గురించి కూడా ఒక్కసారి ఆలోచించాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. భారతదేశం అతి పెద్ద జనసాంద్రత గల దేశం. గతంలో మనం ఇలాంటి వాటిని ఎన్నో అధిగమించాం. ఇప్పుడు కూడా అధిగమిస్తామని తెలుసు. కాకపోతే అందరిని ఒక్క చోట చేర్చేలా తగు చర్యలు మీరు తీసుకోవాలి. అందరం చాలా ఆవేశంతో ఉన్నాం. కాని ఇప్పటికీ మీతోనే ఉన్నాం. జైహింద్ అని కమల్ తన లేఖలో పేర్కొన్నారు.

## ఆస్పత్రిపై నుంచి పడి కరోనా అనుమానిత వ్యక్తి మృతి

### తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదంతో దుర్మరణం

చండీఘడ్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఆస్పత్రి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఓ 55 ఏళ్ల కరోనా అనుమానిత రోగి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఐసోలేషన్ వార్డు నుంచి తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం ప్రాణాలను బలిగొంది. ఆస్పత్రి ఆరో అంతస్తు నుంచి బెడ్‌షీట్ సాయంతో కిందకు దిగేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు.

ఈ ఘటన హర్యానాలో సోమవారం ఉదయం 4 గంటల సమయంలో చోటు చేసుకుంది. పానిపట్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తి ఏప్రిల్ 1న కర్నాల్‌లోని కల్పన చావ్లా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేరాడు. అయితే ఇతనికి కరోనా అనుమానిత లక్షణాలు లేనప్పటికీ.. అతనికున్న ఆరోగ్య సమస్యల రీత్యా ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మొత్తానికి సదరు వ్యక్తి ఇవాళ తెల్లవారుజామున బెడ్‌షీట్లు, కవర్ల సహాయంతో ఆస్పత్రి ఆరో అంతస్తు నుంచి కిందకు దిగేందుకు యత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఇతని రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినప్పటికీ ఫలితం ఇంకా రాలేదు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రి ట్రామా సెంటర్ నుంచి ఆదివారం ఓ రోగి కిందకు దూకడంతో అతనికి గాయాలైన విషయం తెలిసిందే. హర్యానాలో మొత్తం 84 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఆదివారం రోజు కర్నాల్‌కు చెందిన 58 ఏళ్ల వ్యక్తి కరోనాతో మృతి చెందాడు

# శ్రీకాకుళంలో ఫలితమిస్తున్న కట్టడి చర్యలు

### అధికారుల వ్యూహాత్మక చర్యలతో వ్యాప్తి అడ్డుకట్ట

శ్రీకాకుల,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): శ్రీకాకుళం జిల్లాలో కల్లోలం సృష్టిస్తున్న కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు అధికారులు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఢిల్లీ మత ప్రచార సభలో పాల్గొన్న వారికి ఎక్కువగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నందున జిల్లా మొత్తం ఆందోళనకు గురైంది. జిల్లా నుంచి ఎవరూ ఆ సభకు హాజరు కానప్పటికీ వారు వచ్చిన రైళ్లలో జిల్లాకు చెందిన సుమారు 76 మంది ప్రయాణించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జిల్లా అధికారులు ప్రయాణించిన 76 మందిని గుర్తించారు. వీరందరికీ దశల వారీగా పరీక్షలు జరపగా అందరికీ నెగిటివ్ రిపోర్టు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కలెక్టర్ జే నివాస్, ఎస్పీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు త్రిముఖ వ్యూహం పన్నారు. జిల్లా అధికారులు, ప్రజలకు కరోనా వ్యాధికి సంబంధించి ఢిల్లీ నుంచి ప్రయాణించిన వారి విషయంలో ఉత్కంఠ తొలగిపోయింది. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ సిక్కోలును కరోనా బారి నుంచి కాపాడడానికి ప్రయత్నిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ధైర్యం చెబుతున్నారు. దేశంలో కరోనా ప్రభావం మొదలైన దగ్గిరి నుంచే కలెక్టర్ నివాస్ అప్రమత్త మయ్యారు. విదేశాల నుంచి వచ్చిన వారిపై కన్నేసి ఉంచారు. వారు హోమ్ క్వారెంటైన్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. లాక్‌డౌన్‌తో ప్రజలు ఇబ్బంది పడకూడదని నిత్యావసర సరుకులు, మందులు, కూరగాయలు నిర్ణీత ధరలకే అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అమ్మిరెడ్డి సైతం జనతా కర్ఫ్యూ దగ్గిరి నుంచి అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజల్లో లాక్‌డౌన్ భయాలను పటాపంచలు చేశారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, మందుల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు, మాంసం ధరలు పెరుగకుండా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ట్రేడర్స్, పౌల్ట్రీ యజమానులతో సమావేశమై ధరలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా వాసులు ఏప్రిల్ 30వ తేదీ వరకు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు, వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్న ధీమా వద్దని ఇదే పంథాను కొనసాగించి జిల్లాలో వ్యాధి ప్రవేశించకుండా చూడాలని వారంటున్నారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు కూడా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తుండటం వల్ల వాటిని కూడా పూర్తిగా కడిగి, ఎండలో ఉంచిన తర్వాతనే వినియోగించాలని సూచిస్తున్నారు.

ప్రస్తాలను కూడా స్నానానికి ముందే తడిపివేయాలని, పసుపు, వేప రాసుకోవడం ద్వారా క్రిమికీటకాలను దూరంగా ఉంచవచ్చని ఆయుర్వేద, ప్రకృతి వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాకు చెందిన 350 మందికి పైగా మత్స్యకారులు, ఇతరులు పడవల ద్వారా జిల్లాకు చేరుకున్నారని, వారిపై దృష్టిసారించి పరీక్షలు జరపాలని ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు సమాచారమందింది. వారిని గుర్తించే పనిలో ప్రస్తుతం అధికారులు ఉన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా 70వేలమంది మరణం

### -జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): నోవెల్ కరోనా వైరస్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా 70 వేల మంది మరణించారు. ఈ విషయాన్ని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ పేర్కొన్నది. కోవిడ్19 బాధితుల డేటాబేస్‌ను ఆ వర్సిటీ మెయిన్‌టేన్ చేస్తున్న విషయం తెలిసిందే. సుమారు 50215 మంది కేవలం యూరోప్‌లోనే మరణించారు. అత్యధికంగా ఇటలీలో 15,877 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత స్థానంలో స్పెయిన్ ఉన్నది. స్పెయిన్‌లో ఇప్పటి వరకు 13,055 మంది చనిపోయారు. అమెరికాలో మరణించిన వారి సంఖ్య పదివేలకు చేరుకున్నది. ఫ్రాన్స్‌లో 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ప్రపంచవ్యాప్తంగా వైరస్ సంక్రమించిన వారి సంఖ్య దాదాపు 13 లక్షలకు చేరుకున్నది.

యూఎస్‌లో నలుగురు కేరళ వాసుల మృతి

అమెరికాలో కొవిడ్-19తో నలుగురు భారతీయులు మృతిచెందారని మలయాళ సంఘం తెలిపింది. కరోనా వైరస్‌తో అలెయమ్మ కురియకోస్ (65), తనకచన్ ఎంచెనట్టు (51), అబ్రహం శామ్యూల్ (45), స్పాన్ అబ్రహం (21) న్యూయార్క్‌లో మరణించారని ఉత్తర అమెరికా కేరళ సమాఖ్య (ఎఫ్ఓకేఏఎన్ఏ) వెల్లడించింది.

ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సమాఖ్య తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. వ్యాధి సోకిన వారి కుటుంబాలతో నిరంతరం మాట్లాడుతున్నామని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ వెల్లడించింది. ప్రస్తుతం అమెరికాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అమెరికాలో 1,13,000 మందికి పైగా కొవిడ్ సోకింది. కరోనా ప్రజ్వలన కేంద్రమైన న్యూయార్క్‌లోనే 63,000 పైగా బాధితులు ఉన్నారు. ఆ నగరంలోనే ఇప్పటి వరకు 2,620 మందికి పైగా మృతిచెందారు. రోజు రోజుకూ మరణాల సంఖ్య పెరుగుతుండటం కలవరపెడుతోంది.

ఈక్వెడార్‌లో రోడ్డు పక్కను శవాల కుప్పలు

కరోనా వైరస్ ప్రపంచ దేశాలను గడగడలాడిస్తోంది. ముఖ్యంగా దక్షిణ అమెరికా దేశం ఈక్విడార్‌లో వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో అక్కడ కరోనా ఘటనలు హృదయవిదారక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతలా అంటే కరోనా మహమ్మారితో మరణించిన వారికి స్థలం దొరక్కపోవడంతో ఈక్విడార్‌లో రోడ్డుపక్కనే శవాలను వదిలేస్తున్నారు. కరోనాతో చనిపోయిన వారిని బాక్సుల్లోనూ, ప్లాస్టిక్ కవర్లలోనూ చుట్టేసి రోడ్లపై వదిలేస్తున్నారు. ఇప్పటి వరకు ఈక్విడార్‌లో 3,500లకు పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. చనిపోయిన వారి సంఖ్య రెండు వందల లోపులోనే ఉన్నా... వీరికి దహన సంస్కారాలు మాత్రం జరగడం లేదు. వైరస్ వస్తుందన్న భయంతో కుటుంబ సభ్యులు కూడా మృతదేహాల దగ్గరకు వెళ్లడం లేదు.

# ఇదో అతిపెద్ద ఉపద్రవం

### -పేదలను ఆదుకోవాలి: రఘురామరాజన్

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా కల్లోలం అనేది భారత్‌ను స్వాతంత్య్రం తర్వాత వచ్చిన అతిపెద్ద ఆపదగా రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామరాజన్ అభివర్ణించారు. ప్రభుత్వ ఖజానాపై పెనుభారం పడుతున్నప్పటికీ పేదల కోసం డబ్బు వెచ్చించడమే సరైనదని ప్రస్తుతం షికాగో బూత్ యూనివర్సిటీలో ఫైనాన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్ తన బ్లాగ్‌స్పాట్‌లో ఆయన రాశారు. యూరప్ దేశాలు పదిశాతం జీడీపీ సులభంగా ఖర్చు చేయగలవని, కానీ భారత్ ఈ సరికే బారీ ద్రవ్యలోటుతో సంక్షోభంలో చిక్కుకున్నదని గుర్తు చేశారు. అయినా బారత్ ఇంకా ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. లాక్ డౌన్ అనంతర కాలపు వ్యూహాల గురించి ప్రస్తావిస్తూ ఎక్కువ రోజులు పనికి దూరమైన పేదలు, వేతనదార్లు కాని దిగువ మధ్యతరగతివారు బతికిబట్టకట్టేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. ఆహారం, ఆరోగ్య సంరక్షణ, ఆశ్రయం వంటివి అందించేందుకు ప్రభుత్వం, ఎన్జీవోలు సమిష్టిగా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే రుణాల చెల్లింపు మారటోరియం, ఇళ్లు ఖాళీ చేయించడం నుంచి రక్షణ వంటివి ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహించాలని తెలిపారు.

# 2కోట్ల చెక్కును కెసిఆర్‌కు అందించిన పువ్వాడ

హైదరాబాద్హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఖమ్మం నియోజక వర్గంలో దాతల నుంచి రూ.1.75 కోట్లతో పాటు మమత వైద్య విద్యాసంస్థల నుంచి 25 లక్షలను జోడించి మొత్తం 2కోట్లరూపాయలను చెక్కును సీఎం సహాయ నిధికి రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సీఎం కేసీఆర్‌కు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి పువ్వాడను సీఎం అభినందించారు. చాపకింద నీరులా విస్తరిస్తోన్న కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు పలువురు దాతలు పెద్ద మనసుతో ముందుకు వస్తున్నారు. ఈసందర్భంగా మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా నివారణ ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తూ తోటి రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి విపత్కర సవాళ్లు ఎదురైనప్పుడు దాతలు అండగా నిలిచారని గుర్తుచేశారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లాలో ముందుకొచ్చి విరాళాలన అందించిన దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు స్వీయ నియంత్రణతో ఇంట్లోనే ఉండి ఈ వపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని మంత్రి అజయ్ పిలుపునిచ్చారు.

# వ్యవసాయ ఉత్పత్తులపై కంట్రోల్ రూమ్

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడం, వారి సందేహాలను తీర్చడానికి ప్రత్యేకంగా వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు వ్యవసాయశాఖ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు సంప్రదించే రైతులకు అందుబాటులో ఉండే విధంగా అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. కంట్రోల్ రూమ్‌లో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తారు. వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖలకు సంబంధించిన సహాయ సంచాలకుల స్థాయి అధికారులతో ప్రత్యేకంగా ఒక బృందం పనిచేస్తుందని కమిషనర్ తెలిపారు. ప్రతి రోజూ ఆయా జిల్లాల నుంచి రైతులు ఫోన్ ద్వారా అడిగే సందేహాలకు సమాధానాలు ఇస్తారు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారు. ఫిర్యాదులకు సంబంధించి సబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు.

# కరోనా గుప్పిట్లో భీమ్ ఆర్మీ సభ్యులు?

### ఖమ్మంలో ఒకరికి పాజిటివ్ కేసుతో అలజడి

### తబ్లీఘీ సభ్యులతో కలసి ప్రయాణించడంతో అనుమానాలు

ఖమ్మం,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): తెలంగాణలో తబ్లీఘీ జమాత్ వర్కర్స్ సృష్టించిన కరోనా కలకలం ఇంకా సమసిపోకముందే తెలంగాణకు మరో ముప్పు పొంచివుందన్న వార్తలు భయం కలిగిస్తున్నాయి. తబ్లీఘీ సంస్థ వర్కర్లతోపాటు భీమ్ ఆర్మీ సంస్థ వర్కర్లు కూడా పెద్ద సంఖ్యలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ రైలులో రావడంతో వారికి కూడా కరోనా సోకి వుండవచ్చన్న భయాందోళన వ్యక్తమవుతోంది. దాంతో వారందరినీ క్వారెంటైన్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లను ప్రారంభించింది. భీమ్ ఆర్మీ.. తెలంగాణలో విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. భీమ్ ఆర్మీకి చెందిన 11 మంది సభ్యులు గల బృందం మార్చి 13వ తేదీన ఢిల్లీకి వెళ్ళింది. అదే రైలులో తబ్లీఘీ సంస్థకు చెందిన వారు ప్రయాణించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. భీమ్ బృందం కూడా నాలుగురోజుల పాటు.. ఢిల్లీలో వుండి ఆజాద్ సమాజ్ పార్టీ నేత చంద్రశేఖర్ ఆజాద్‌తో పాటు వీరంతా పలువురు ఢిల్లీలోని తెలుగు మీడియా జర్నలిస్టులను కలిశారు.

ఆ తర్వాత మార్చి 17వ తేదీన భీమ్ సభ్యులు ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రైలులో తిరిగి వచ్చారు. అదే రైలులో పెద్ద సంఖ్యలో తబ్లీఘీ వర్కర్లు ప్రయాణం చేశారు. ఈ భీమ్ ఆర్మీకి చెందిన 11 మందిలో ఇద్దరికి ఇప్పటికే కరోనా వైరస్ పాజిటివ్ రికార్డయ్యింది. దాంతో మిగిలిన తొమ్మిది మందిని క్వారెంటైన్‌లో పెట్టారు. భీమ్ ఆర్మీలో ఖమ్మంలో ఒకరికి, మహబూబాబాద్‌లో మరొకరికి కరోనా పాజిటివ్ కనిపించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ భీమ్ టీమ్ సభ్యులు ఎవరెవరిని కలిశారు? ఎక్కడెక్కడ తిరిగారు అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఒకవేళ వీరంతా పెద్ద సంఖ్యలో తమ సంస్థ కార్యకర్తలో భేటీలు కానీ, సమాలోచనలు గానీ జరిపినట్లయితే పెద్ద సంఖ్యలో కరోనా వ్యాప్తి జరిగి వుండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ముందుగా ఈ తొమ్మిది మందిని క్వారెంటైన్‌కు తరలించామని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న తరుణంలో ఎవరూ ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. దీనిపై ఆరా తీస్తున్నామని డిఎంహెచ్‌వో మాలతి అన్నారు. కరోనా మహమ్మారి తమ ప్రాంతంలో లేదనుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఖమ్మం జిల్లా ఉలిక్కిపడే విషయం తెలిసింది. ఢిల్లీ వెళ్లిన ఓ గిరిజన నేతకు కోవిడ్-19 లక్షణాలు లేకుండానే కరోనా పాజిటివ్‌గా రిపోర్టు రావడం వైద్య ఆరోగ్యశాఖలో విస్మయాన్ని కలిగించింది. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి కరోనా పాజిటివ్ కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం నగరంలోని మొదటి డివిజన్ పెద్దతండాకు చెందిన ఓ గిరిజన వ్యక్తి సామాజిక , రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని తెలిపారు. గత నెల 14న ఖమ్మం నుంచి ఢిల్లీకి ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లారు. 15వ తేది అక్కడే ఉన్న అంబేద్కర్ భవనంలో బస చేసి 16న ఢిల్లీలోని నోయిడా ప్రాంతంలో ఓ రాజకీయ పార్టీ అవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి అంబేద్కర్ భవనంలోనే బస చేసి 17న పలు ప్రాంతాల్లో పర్యటించారు. సాయంత్రానికి మరో 12మంది వ్యక్తులతో కలిసి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో ఖాజీపేటకు చేరుకున్నారు. 18న ఇంటికి చేరుకున్నారు. 19న ఖమ్మంలో తన స్నేహితుడితో కలిసి మయూరి సెంటర్‌కు సమీపంలో ఉన్న టీ సెంటర్‌కు వెళ్లారు. 20న తిరిగి ఇదే ప్రాంతాల్లో సంచారించారు. 21నుంచి ఇంట్లోనే ఉన్నారు. దీంతో అతని కదలికలపై ఆరా తీస్తున్నారు.

# కరోనా అదుపునకు లాక్‌డౌన్ పొడిగించడమే మంచిది

### లాక్‌డౌన్ కఠినంగా అమలు చేయడం వల్లనే అదుపు

### అదొక్కటే మనముందున్న పెద్ద ఆయుధం

### అమెరికా లాంటి దేవాలే విలవిల్లాడుతున్నాయి

### నష్టమైనా లాక్‌డౌన్ వారంపది రోజులు పొడిగించాలి

### ప్రధాని మోడీని కోరిన సిఎం కెసిఆర్

### పాజిటివ్ వస్తే గాంధీలో ఉండాల్సిందే

### వైద్య,పారిశుద్య సిబ్బందికి సిఎం గిఫ్ట్

### మీడియా సమావేశంలో సిఎం కెసిఆర్ స్పష్టీకరణ

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ వల్లే కరోనా వైరస్‌ను అదుపు చేయగలిగామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ వైరస్‌తో చనిపోయిన వారంతా మర్కజ్ వెళ్లొచ్చిన వారేనని సీఎం పేర్కొన్నారు. అలాగే లాక్‌డౌన్ పొడించడమే మనముందున్న అతిపెద్ద ఆయుధమని అన్నారు. దీనిని మరో వారం పదిరోజులు పొడిగిస్తేనే మంచిదన్నారు. ఈమేరకు ఆయన ప్రధాని మోడీకి కూడా విజ్ఞప్తి చేశారు. ప్రగతి భవన్‌లో కరోనా ప్రభావం, లాక్‌డౌన్‌పై అత్యున్నత స్థాయి సమావేశం ముగిసిన అనంతరం సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. మరికొన్ని రోజులు లాక్‌డౌన్ కొనసాగించాలన్నది తన అభిప్రాయమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బోస్టన్ నివేదిక కూడా దేశంలో జూన్ 3వ తేదీ వరకు లాక్‌డౌన్ కొనసాగించాలని పేర్కొందని ఆయన గుర్తు చేశారు. కరోనా కారణంగా ఆర్థికంగా దేశం దెబ్బతింటోందని పేర్కొన్నారు. లాక్‌డౌన్ ఎత్తివేస్తే ఇబ్బందులు వస్తాయని.. అవన్నీ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. లాక్‌డౌన్ కొనసాగింపుపై చర్చలు కొనసాగుతున్నాయని కేసీఆర్ అన్నారు. అమెరికా లాంటి పరిస్థితులు దేశంలో లేకపోవడం మన అదృష్టమని కేసీఆర్ అన్నారు.

లాక్‌డౌన్ వల్ల ఆర్థికంగా నష్టపోక తప్పదు అని అన్నారు. మన రాష్ట్రానికి రోజుకు రూ. 400 నుంచి రూ. 430 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా లాక్‌డౌన్ మూలంగా కేవలం రూ. 6 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. ప్రజలను బతికించుకోవాలంటే లాక్‌డౌన్ తప్ప వేరే మార్గం లేదు. ఒక వేళ లాక్‌డౌన్ సడలిస్తే పరిస్థితి ఏంటి? అని సీఎం ప్రశ్నించారు. మళ్లీ గుంపులు గుంపులుగా రోడ్ల మీదకి వస్తే ఎవరు జవాబుదారీ అని సీఎం అడిగారు. లాక్‌డౌన్ సడలించడమంటే అంత ఆషామాషీ కాదు. ప్రధానితో రోజుకు రెండుసార్లు మాట్లాడిన సందర్భాలు ఉన్నాయన్నారు. లాక్‌డౌన్‌ను కొనసాగించాల్సిందేనని ప్రధానికి చెప్పానని అన్నారు. ఇది ప్రపంచానికి వచ్చిన పీడ. ఒక్క కుటుంబానికో, జాతికో రాలేదు. 22 దేశాలు పూర్తిగా 100 శాతం లాక్‌డౌన్ చేశాయి. జపాన్, సింగపూర్, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, కొలంబియా, అ÷-జ్గ÷ంటీనా, నేపాల్‌తో పాటు మరిన్ని దేశాలు మన పద్ధతిలోనే లాక్‌డౌన్ చేశాయి. మరో 90 దేశాలు పాక్షికంగా లాక్‌డౌన్ చేశారు. మన రాష్ట్రం మంచి నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సమాజాన్ని బతికించుకున్నామంటే లాక్‌డౌన్, స్వీయ నియంత్రణ వల్లే అయిందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇవాళ న్యూయార్క్‌ను చూస్తే శవాల గుట్టలే కనిపిస్తున్నాయి. అలాంటి దుఖం ఎవరికి సంభవించకూడదు. మనమైతే ఆగమయ్యేవాళ్లం. లాక్‌డౌన్ వల్లనే పరిస్థితిని కంట్రోల్ చేశాం అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

ఈ జబ్బు మన దేశంలో పుట్టింది కాదని, వేరే దేశంలో పుట్టిన జబ్బు ట్రాన్స్‌మిట్ అయింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు అన్నింటిని లాక్‌డౌన్ చేశారు. లాక్‌డౌన్ వల్ల మన దేశం, రాష్ట్రం అద్భుతమైన గణనీయమైన విజయం సాధించింది. ఈ విషయంలో సందేహం అవసరం లేదు అని సీఎం స్పష్టం చేశారు దేశంలో ఇప్పటి వరకు కరోనా సోకిన వారి సంఖ్య 4,314 కాగా, మరణించిన వారి సంఖ్య 122 అన్నారు. చాలా సేఫ్‌గా దేశం ముందుకెళ్తుంది. ఇది తాను చెప్పడం లేదు. ఇండియా మంచి పని చేసింది అని ఇంటర్నేషల్ జర్నల్స్ ప్రకటించాయి. ఐక్యతను ప్రదర్శించి ఇండియా మంచి పని చేసిందని ఇతర దేశాల అధినేతలు ప్రశంసించారు. లాక్‌డౌన్ విధించకపోతే భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొనే వాళ్లం. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశం మనది. అమెరికా లాంటి దేశం భయంకరమైన పరిస్థితిలో ఉంది. న్యూయార్క్‌లో శవాల గుట్టలు ఉన్నాయి. అక్కడ బాధలు హృదయవిదారకంగా ఉన్నాయి అని సీఎం తెలిపారు. న్యూయార్క్‌లో శవాన్ని ముట్టుకునే వారు ఎవరూ లేరు. అంత పవర్ ఉన్న దేశం అయినప్పటికీ కూడా దయనీయమైన స్థితిలో ఉంది. ఆ పరిస్థితి మనకు ఉంటే కోట్ల మంది చనిపోయేవారు. మన రాష్ట్రంలో కరోనా కేసుల విషయంలో రెండు దశలను అమలు చేశాం. మొదటి దశలో విదేశాల నుంచి వచ్చిన వారు, వారి ద్వారా కొంతమందికి ట్రాన్స్‌మిట్ అయిందని సీఎం తెలిపారు. మొదటి దశలో మొత్తం 50 మందికి కరోనా సోకితే ఇందులో 30 మంది విదేశాల నుంచి వచ్చిన వారు. మిగతా 20 మంది వారి కుటుంబ సభ్యులేనని సీఎం పేర్కొన్నారు. మొదటి దశలో ఇప్పటి వరకు 25,937 మందిని క్వారంటైన్ చేసి ప్రభుత్వ పర్యవేక్షణలో పెట్టుకున్నామని సీఎం చెప్పారు. ఈ 50 మందిలో ఎవరూ చనిపోలేదు అని సీఎం స్పష్టం చేశారు. వీరిలో 35 మంది డిశ్చార్జి అయ్యారు. మిగతా వారు కూడా ఎల్లుండి లోపు డిశ్చార్జి అవుతారు. క్వారంటైన్‌లో ఉన్న వారిని కూడా 9వ తేదీ లోపు డిశ్చార్జి అవుతారు. సంతోషంగా వాళ్ల ఇండ్లకు పోతారు. ఇది మొదటి ఫేజ్ అని సీఎం తెలిపారు. రెండో దశలో వచ్చిన కేసులన్నీ మర్కజ్ నుంచి వచ్చినవే అని సీఎం పేర్కొన్నారు. నిజాముద్దీన్ సంఘటన దేశాన్ని అతలాకుతలం చేసింది. మర్కజ్ కేసుల్లో భాగంగా పాతవి, కొత్తవి కలిపి.. 364 మందికి సోకింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 11 మంది కరోనాతో చనిపోయారు. వీరంతా మర్కజ్ వెళ్లొచ్చిన వారేనని సీఎం స్పష్టం చేశారు. గాంధీలో 308 మంది చికిత్సలో ఉన్నారు. మర్కజ్ నుంచి వచ్చిన 1089 మందిని గుర్తించాం. ఇంకో 30 మంది ఢిల్లీలోనే ఉన్నట్లు తెలుస్తోందన్నారు సీఎం. ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో 173 మందికి కరోనా సోకగా.. వీరి నుంచి మరో 93 మందికి సోకింది. మర్కజ్ వారిని గుర్తించే పనిలో ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు పని చేస్తున్నారు. లాక్‌డౌన్‌లో భాగంగా ప్రజలు సహకరిస్తున్నారు. ఇంకా సహకరించాలి అని సీఎం కేసీఆర్ కోరారు. దేశ జనాభాతో పోలిస్తే కరోనా పాజిటివ్ కేసులు చాలా తక్కువగా ఉన్నాయని, కరోనా వైరస్ భయానక పరిస్థితులు లేవని ఆయన అన్నారు. 22 దేశాల్లో పూర్తిస్థాయి లాక్‌డౌన్ కొనసాగుతోందని, జపాన్‌లో నెలపాటు లాక్‌డౌన్ ప్రకటించారని అన్నారు. కాగా, ఇక 90 దేశాలు పాక్షిక లాక్‌డౌన్ పాటిస్తున్నాయని పేర్కొన్నారు. అత్యంత శక్తివంతమైన దేశం అమెరికాలో శవాల గుట్టలు కనిపిస్తున్నాయని అన్న కేసీఆర్ దేశంలో లాక్‌డౌన్ వల్ల కరోనా ఉధృతి తగ్గిందని అన్నారు. మీడియా సమావేశంలో మంత్రులు ఈటెల రాజేందర్,కెటిఆర్ పాల్గొన్నారు.

పారిశుద్య కార్మికులకు బొనాంజా

కరోనా నియంత్రణ చర్యల్లో విశ్రాంతి లేకుండా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సీఎం కేసీఆర్ శుభవార్త వినిపించారు. ప్రగతి భవన్‌లో కరోనా ప్రభావం, లాక్‌డౌన్ అమలుపై అత్యున్నత స్థాయి సమావేశం ముగిసిన అనంతరం సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు 95,392 మంది వరకు ఉంటారు. పారిశుద్ధ్య కార్మికుల జీతంలో విధించిన కోతను ఉపసంహరించుకుంటున్నామని సీఎం తెలిపారు. సీఎం ప్రోత్సాహం కింద మున్సిపల్ మున్సిపల్, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ. 5 వేలు ఇస్తాం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ కార్యకర్తలకు రూ. 7,500 ఇస్తాం. డాక్టర్లు, వైద్య సిబ్బందికి పదిశాతం జీతాలు పెంచి ఇస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులు బాగా కొనసాగిస్తే జబ్బు వ్యాప్తిని నియంత్రించొచ్చు అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

# దేశంలో 4,067కి చేరిన కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య

### 24 గంటల్లో 693 పాజిటివ్ కేసులు నమోదు

### మొత్తం 30 మంది వైరస్ బాధితులు మృతి

### ప్రకటించిన కేంద్ర కార్యదర్శి లవ్ అగర్వాల్

### మూడోదశ ప్రమాదం పొంచి ఉందన్న ఎయిమ్స్ వైద్యుడు

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నాటికి కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య 4,067కి చేరింది. గడిచిన 24 గంటల్లో 693 పాజిటివ్ కేసులు నమోదు అవ్వడంతో పాటు 30 మంది వైరస్ బాధితులు మృతి చెందారు. ఈ మేరకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ ప్రకటన చేశారు. ఇక ఢిల్లీలోని మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారిలో 1445 మందికి కరోనా పాజిటివ్‌గా తేలినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు దేశంలో నమోదైన కేసుల్లో 76శాతం పురుషులే ఉన్నారని లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. మరోవైపు దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.1100 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. మరో మూడువేల కోట్లు రాష్ట్రాలకు కేటాయిస్తామని తెలిపారు. ఇదిలావుంటే దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వైరస్ వ్యాప్తి కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా పాజిటివ్ కేసుల సంఖ్యతో పాటు వైరస్ సోకి మృతి చెందిన వారి సంఖ్యా నానాటికీ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే దేశంలో కరోనా వైరస్ వ్యాప్తిపై ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా పలు కీలక విషయాలను వెల్లడించారు. దేశంలో పలు ప్రాంతాల్లో కరోనా వైరస్ రెండో దశను దాటి మూడో దశకు చేరుకుందని ప్రకటించారు. అయితే మూడో దశ దేశ వ్యాప్తంగా కేవలం కొన్ని ప్రాంతాల్లోనే మాత్రమే ఉందని తెలిపారు. సోమవారం ఓ కార్యక్రమంలో డాక్టర్ రణ్‌దీప్ మాట్లాడుతూ.. 'దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి రోజురోజుకూ పెరగడం ఆందోళనకరం. పలు ప్రాంతాల్లో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ (లోకల్ కాంటాక్ట్) ద్వారా వైరస్ సోకడాన్ని గుర్తించాం. దీనిని వైరస్ మూడోదశగా చెప్పుకోవచ్చు. అయితే ఈ దశ దేశంలో కొన్ని ప్రాంతాలకు మాత్రమే విస్తరించింది. దేశ వ్యాప్తంగా అత్యధిక భాగం కేవలం రెండోదశలో ఉండటం కొంత ఉపశమనం కలిగించే అంశం. అయితే మూడోదశ అనేది మన దేశంలో ప్రస్తుతం ప్రారంభదశలోనే ఉంది. దానిని అదుపుచేయడానికి ఇప్పటికే తగిన చర్యలు తీసుకుంటున్నాం. దానిని ఎంత త్వరగా అరికడితే అంతమంచింది. లేకపోతే మూడోదశ ఉధృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొక తప్పదు.' అని అన్నారు.

# మహావీరుడికి గవర్నర్ నివాళి

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): మహావీర్ జయంతి సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సోమవారం రాజ్‌భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహావీరుడు ఆధ్యాత్మిక వేత్తగా, జైన మతస్థాపకుడిగా ప్రఖ్యాతిగాంచారని అన్నారు. ఆయన జీవిత కాలమంతా సత్యబోధన, అహింస, జీవహింస చేయకూడదన్న ప్రధాన బోధనలతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈసందర్భంగా జైనులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా కొవిడ్-19 నివారణకు ప్రధాన

మంత్రి మోదీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా పీఎంకేర్స్‌కు 5లక్షల రూపాయల విరాళాన్ని గవర్నర్ తమిళిసై ప్రకటించారు. అలాగే తన వేతనం నుంచి నెలకు 30శాతం 1,05,000 రూపాయలను కూడా గవర్నర్ తమిళిసై ఇవ్వనున్నట్టు తెలిపారు.

# బిట్స్ పిలానీ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): భారత ప్రభుత్వం కరోనా వైరస్ వ్యాపించకుండా లాక్‌డౌన్‌ను విధించడంతో అనేక మంది దినసరి కూలీలు, అనాథలు, బిక్షాటన చేసుకునే వారు పూట గడవక ఇబ్బంది పడుతున్నారు. అయితే ప్రభుత్వాలు వీరి ఆకలిని తీర్చడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వంతో పాటు కొన్ని స్వచ్ఛంధ సంస్థలు, దాతలు వచ్చి ఆహారం దొరకని వారికి అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే బిట్స్‌పిలానీ హైదరాబాద్ క్యాంపస్ వారు క్యాంపస్‌కు సమీపంలో ఉన్న వారికి ఆదివారం నిత్యవసర సరుకులు అందించారు. దాదాపు 450 కుటుంబాలకు సాయాన్ని అందించారు. ఈ విషయం పట్ల మండల ఎంఆర్‌వో శ్రీగోవర్ధన్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిట్స్‌పిలానీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. సుందర్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ ఎం. శ్రీనివాసరెడ్డి, రజిని వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. రానున్న రెండురోజుల్లో అంతైపల్లి, ఫరాహనగర్ ప్రాంతాల్లో ఇలాంటి డ్రైవ్ నిర్వహిస్తామని వారు తెలిపారు.

# కరోనాకు హైడ్రో క్లోరోక్విన్ పనిచేస్తుందని చెప్పలేం

### వైద్య, ఆరోగ్య సిబ్బందికి మాత్రమే ఉపయోగిస్తున్నాం

### రాజస్థాన్‌లో తాజాగా ఓ వ్యక్తి కరోనాకు బలి

### కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనాను తగ్గించడానికి హైడ్రోక్సీక్లోరోక్విన్ కచ్చితంగా పనిచేస్తుందని చెప్పలేమని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. మలేరియాను తగ్గించేందుకు ఉపయోగించే క్లోరోక్విన్ మందు కోవిడ్-19పై ప్రభావం చూపుతుందనడానికి సరైన ఆధారాలు లేవని, అందుకే కరోనాతో బాధపడేవారికి ఈ మందును సూచించలేక పోతున్నామని ఆయన తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బందికి కరోనా సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఎంతో కొంత ప్రభావం చూపిస్తుందన్న నమ్మకంతోనే వారికి మాత్రం క్లోరోక్విన్‌ను సూచిస్తున్నాం. అయితే దానికి కూడా కచ్చితమైన నిబంధనలను అనుసరించి ప్రొఫిలాక్సిస్ రూపంలో అందజేస్తున్నాం' అని అగర్వాల్ చెప్పారు.

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్.. భారతదేశంలో కూడా ప్రబలుతోంది. ఇప్పటికి 30 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం, దేశంలో కరోనా కేసులు 4వేలు దాటాయి. మొత్తమ్మీద దేశంలో 4,067 కరోనా కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. వీరిలో 66మంది విదేశీయులు ఉన్నట్లు సమాచారం. అలాగే ఈ మహమ్మారికి బలైన వారి సంఖ్య కూడా 100 దాటింది తెలుస్తోంది. ఇప్పటివరకు 109మంది ఈ వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. మొత్తమ్మీద 292 మంది కోలుకున్నారు. ఈ క్రమంలో రాజస్థాన్ రాష్ట్రంలో 60 ఎళ్ల ఓ వృద్ధుడు కరోనాతో మరణించాడు. శనివారం అర్ధరాత్రి కరోనా లక్షణాలు కనబర్చిన సదరు వ్యక్తిని దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలోనే ఆ వ్యక్తి మరణించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రంలో కరోనా నమోదైన కేసుల సంఖ్య 274కి చేరిందని తెలిపారు.

తమిళనాడులో తీవ్రం

తమిళనాడులో కరోనా మహమ్మారి తీవ్ర రూపం దాల్చుతోంది. సోమవారం ఒక్కరోజే ఇక్కడ కొత్తగా 50 కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. ఇందులో 48 మంది తబ్లిగి జమాత్‌కు వెళ్లివచ్చిన వారే ఉన్నారని తమిళనాడు ఆరోగ్యశాఖ వెల్లడించింది. తమిళనాడులో ఇవాళ 50 కొత్త కొవిడ్-19 కేసులు నమోదయ్యాయి. ఇందులో 48 మంది తబ్లిగి జమాత్ కార్యక్రమానికి వెళ్లివచ్చిన వారే ఉన్నారు. తాజా కేసులతో కలిపి రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 621కి చేరింది. ఇందులో 570 మంది కరోనా బాధితులు తబ్లిగి జమాత్ కార్యకర్తలే... అని తమిళనాడు ఆరోగ్య శాఖ కార్యదర్శి బీలా రాజేశ్ వెల్లడించారు. కాగా దేశ వ్యాప్తంగా కోవిడ్-19 బారిన పడిన వారి సంఖ్య ఇవాళ 4,067 చేరినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ మహమ్మారి కారణంగా 109 మంది ప్రాణాలు కోల్పోగా మరో 3666 మంది చికిత్స పొందుతున్నారు.

# కరోనా మరణాలకే జీవితబీమా: ఎల్ఐసి

న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్(కోవిడ్-19)తో ప్రాణాలు కోల్పోయిన వారికి కూడా జీవితబీమా లభిస్తుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దీనిని స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన ఖాతాదారులు ఎవరైనా సరే కోవిడ్-19 కారణంగా ప్రాణాలు కోల్పోయితే.. ఆ బీమాకు సంబంధించిన పక్రియను మరింత వేగంగా ముగిస్తామని హామీ ఇచ్చారు. కోవిడ్-19 మృతుల కేసులను 'ఫోర్స్ మజూరే' కిందకు పరిగణించమని ఎల్ఐసీ పేర్కొంది. ఏదైనా ఘటన ఊహించకుండా.. అడ్డుకోలేని పరిస్థితుల్లో సంభవిస్తే.. దాన్ని ఫోర్స్ మజూరే అని అంటారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇందుకు సంబంధించి పుట్టుకొస్తున్న పుకార్ల గురించి స్పష్టత కావాలని కోరిన ఖాతాదారుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అన్ని బీమా కంపెనీలు ఇందుకు సంబంధించి ఖాతాదారులతో సంప్రదింపులు జరిపాయి. ప్రపంచవ్యాప్తంగా మరియు మన దేశంలోనూ తీవ్రస్థాయిలో కోవిడ్-19 ప్రభావం చూపుతున్న నేపథ్యంలో బాధితులకు బీమాను అందించడం.. మన ప్రాథమిక బాధ్యత. లాక్‌డౌన్ సమయంలో పాలసీదారులకు కలిగిన అంతరాయం చాలా చిన్నది. అందుకే వారికి నిరంతరాయంగా డిజిటల్ సేవలు అందిస్తాము.. అది కోవిడ్-19కు మృతి సంబంధించిన మరణ దావా అయినా.. లేదా.. వారి పాలసీకి సంబంధించిన ఇతర సేవలు అయినా అని ఎల్ఐసీ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ ఎస్.ఎన్. భట్టా చార్య అన్నారు. ఇలాంటి కష్టసమయంలో ఖాతాదారులకు అండగా ఉండాలని అన్ని కంపెనీలను కోరుతున్నాము. తప్పుడు సమాచారంతో.. పుకార్లతో ఖాతాదారులు కంగారుపడకుండా చూడాలని ఆన కోరారు.

# కెటిఆర్‌కు 25 లక్షల విరాళం ఇచ్చిన యూనిక్ ట్రీస్

హైదరాబాద్,ఏప్రిల్6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ప్రయత్నాలకు తమ వంతు సాయంగా పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటిస్తున్నారు. తాజాగా యూనిక్ ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.25 లక్షల విరాళం ఇచ్చింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామడుగు రామ్‌దేవ్ రావు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేతృత్వంలో.. రాష్ట్ర ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు సంబంధిత చెక్కును సోమవారం ప్రగతి భవన్‌లో అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ రామడుగు రామ్‌దేవ్ రావుని అభినందించారు. అలాగే పలువురు ప్రముఖులు ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిసి విరాళాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు.

పుల్లెల గోపీచంద్ 26లక్షల విరాళం

కరోనాపై పోరాటానికి సాయం చేసేందుకు బ్యాడ్మింటన్ జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ముందుకొచ్చాడు. రూ.26లక్షలను విరాళంగా ప్రకటించాడు. రూ.11లక్షలను పీఎం-కేర్స్ నిధికి, రూ.10లక్షలను తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి, రూ.5లక్షలకు ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించినట్టు సోమవారం వెల్లడించాడు. కరోనాపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వాలకు ఓ చిన్న సాయం చేస్తున్నానని గోపీచంద్ చెప్పాడు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో గొప్పగా పని చేస్తున్నాయని, మార్గనిర్దేశకాలను పాటిస్తూ ఇంట్లో ఉంటూ సహకరిద్దామని ప్రజలకు పిలుపునిచ్చాడు.

పంకజ్ అద్వానీ ఐదు లక్షల విరాళం

కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు తామున్నామంటూ క్రీడాకారులు ముందుకు వస్తూనే ఉన్నారు. ఇప్పటికే పలువురు ఆర్థిక సహాయం ప్రకటించగా, సోమవారం స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ రూ.5 లక్షల విరాళం ప్రకటించాడు. ఈ విషయాన్ని తన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నాడు. 'కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు నా వంతు సహాయం చేస్తున్నాను. పీఎం కేర్స్ సహాయక నిధికి 5 లక్షలు ఇస్తున్నాను. వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహనతో పాటు ప్రేమను, వాత్సాల్యాన్ని పంచండి. జై హింద్' అని అద్వానీ ట్వీట్ చేశాడు.

# కరోనా నేపథ్యంలో బడ్జెట్ మార్చాల్సిందే

### కాంగ్రెస్ నేత జైరాం రమేష్

న్యూఢిల్లీ,ఏప్రిల్67(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా కారణంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు 2020-21 ఏడాదికిగాను పార్లమెంటులో ఆమోదం పొందిన కేంద్ర బడ్జెట్‌ను పూర్తిగా మార్చాల్సి రావచ్చని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ అన్నారు. లాక్‌డౌన్ కారణంగా త్వరలో ఏర్పడబోయే సమస్యలను అధిగమించేందుకు మరో బడ్జెట్ అవసరం రావచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించటానికి ముందే ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపక్ష నేతలతో చర్చిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. తాము కరోనా సంక్షోభాన్ని ఎదుర్కోవటంతో మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి మద్దతిచ్చామని, ప్రధాని ఏం చేసినా మద్దతిస్తామని అనుకోవద్దని స్పష్టంచేశారు.

# కరోనా సహాయక చర్యల్లో కాంగ్రెస్

### వస్తు సామాగ్రి వాహనానికి ఉత్తమ్ జెండా

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సామాజిక బాధ్యతగా కరోనా వైరస్ నివారణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గ సమన్వయకర్త అనిరుధ్ రెడ్డి తన సొంత ఖర్చుతో ప్రజలకు శానిటైజర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. శానిటైజర్లు తీసుకెళ్తున్న వాహనాలను గాంధీభవన్ వద్ద ఉత్తమ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా తాము ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. కరోనా వైరస్ వ్యాప్తిలో కొందరు మతాన్ని వేలెత్తి చూపుతున్నారని.. అది సరైంది కాదని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో 13 రోజులుగా లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ.. ఇప్పటి వరకు కేవలం 22లక్షల టన్నుల బియ్యం మాత్రమే పేదలకు పంపిణీ జరిగిందని విమర్శించారు. కరోనా వైరస్, లాక్‌డౌన్ నేపథ్యంలో రేషన్ దారులకు రూ.1500 ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకూ ఆమొత్తం ఎవరికీ అందలేదన్నారు. కేంద్రం నుంచి ఇస్తామన్న బియ్యం కూడా ఇంకా తెలంగాణకు రాలేదని ఉత్తమ్ ఆక్షేపించారు.

# వర్ధమాన్ కోట గ్రామానికి చేరుకున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యపేట, ఏప్రిల్ 7: జిల్లాను కరోనా వైరస్ అతులాకుతులం చేస్తున్న నేపథ్యంలో మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకునేందుకు ఆయన నేరుగా సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నాగరం మండలం వర్ధమాన్ కోటకు చేరుకున్నారు. ఒక్కటేసారి ఆరుగురికి పాజిటివ్ గా తేలిన వర్ధమాన్ కోట గ్రామాన్ని ప్రభుత్వం పూర్తిగా తమ ఆదీనం లోకి తెచ్చుకుంది. పూర్తిగా అష్టదిగ్బంధనం లో ఉన్న ఆ గ్రామానికి మంత్రి వచ్చారని తెలుసుకున్న గ్రామస్తులు ఇక తమకు ఉపశమనం కలుగుతుందంటూ ఊపిరి పీల్చుకున్నారు.

అప్పటికే కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న ఆ గ్రామంలో మంత్రి జగదీష్ రెడ్డి కలియ తిరుగుతూ ప్రజలెవ్వరు భయాందోళనలకు గురి కావొద్దని భరోసా ఇచ్చారు. అప్పటికే నియోజకవర్గ కేంద్రంలో ఉంటూ 24 గంటలుగా గ్రామంలో పరిస్థితులు పర్యవేక్షిస్తున్న స్థానిక శాసనసభ్యులు గాధారి కిశోర్ కుమార్ గ్రామానికి చేరుకున్న మంత్రి జగదీష్ రెడ్డి దృష్టికి పూర్తి వివరాలు తీసుకవచ్చారు. సమగ్ర సమాచారం తెలుసుకున్న మంత్రి జగదీష్ రెడ్డి గ్రామస్తులు ఎవరు భయాందోళనకు గురి కావొద్దన్నారు. వైద్య పరీక్షలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అక్కడి నుండే వైద్యారోగ్య శాఖా అధికారులతో మాట్లాడుతూ వైద్యసిబ్బందిని మరింత పెంచాల్సిన ఆవశ్యకత ను వివరించారు.అక్కడే ఉన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కి ఈ దిశగా ఆదేశాలు జారీ చేశారు.అదే సమయంలో పరీక్షలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. ఒకే గ్రామం నుండి 6 గురికి కరోనా వైరస్ తో పాజిటివ్ గా తేలిన నేపథ్యంలో వారితో సంబంధ బంధావ్యాలు కలిగి ఉన్నట్లు అనుమానించిన వర్ధమాన్ కోటకే చెందిన మరో 33 మందిని మాసిరెడ్డి పల్లికి చెందిన 7 గురిని క్వారంటైన్ కు తరలించాలని మంత్రి జగదీష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒక్క సూర్యపేట జిల్లాలోనే ఇప్పటి వరకు 8 మందికి పాజిటివ్ గా తేలడంతో గంబీరంగా ఉన్న పరిణామాలను మంత్రి జగదీష్ రెడ్డి దగ్గర ఉండి సమీక్షిస్తున్నారు. ఇవే పరిస్థితులపై ఈ మధ్యాహ్నం సూర్యపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఆయన అధికారులను ఆదేశించారు.

ఢిల్లీలోని మార్కజ్ కు వెళ్లి వచ్చిన వారి నుండి వర్ధమాన్ కోట లో ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమైనాయంటూ అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సూర్యపేట లోని కుడ కుడ రోడ్ లో మొట్టమొదటి సారిగా వెలుగు చూసిన పాజిటివ్ కేసు సోకిన వ్యక్తి నుండే వర్ధమాన్ కోటకు ఎగబాకిందన్నది అధికారులు మంత్రి దృష్టికి తీసుక వచ్చారు. అంతే గాకుండా జిల్లాలో పాజిటివ్ కేసు నమోదు అయిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీష్ రెడ్డి సూచనల మేరకు ఎలెర్ట్ అయిన అధికార యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగి ప్రక్షాళన చర్యలు చేపట్టారు. అయితే మొట్టమొదటి సారిగా కరోనా వైరస్ బారిన పడిన వ్యక్తికి వర్ధమాన్ కోట నివాసి అల్లుడు కావడంతో పాటు ఢిల్లీకి పోయిన వారిలో తను కూడా ఉండడమే ఈ పరిస్థితి ఏర్పడిందన్నది అధికారులు మంత్రికి చెప్పారు.

ఈ క్రమంలోనే నిన్న సాయంత్రం వరకు 73 మంది నుండి పరీక్షల కోసం శాంపిల్స్ నమూనాలు సేకరించి నట్లు అధికారులు మంత్రి కి వివరించడంతో పాటు126 మందిని ప్రభుత్వ క్యారంటైన్ కు మరో 283 మందిని హోం క్యారంటైన్ లో ఉంచిన లెక్కలను అధికారులు తెలిపారు. అదే విదంగా ఆ సంఖ్య ఈ రోజు ఒక్క వర్ధమాన్ కోట నుండే పంపిన 33 మందిని మాసిరెడ్డి పల్లికి చెందిన 7 గురితో కలుపుకుంటే ఆ సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిస్థితులు చెయ్యి దాటి పోకుండా చూడాల్సిన బాధ్యత మనమీదే ఉందంటూ అధికారులకు చెప్పిన మంత్రి జగదీష్ రెడ్డి ఈ మధ్యాహ్నం తరువాత సూర్యపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జరుగు ప్రత్యేక సమీక్షా సమావేశంలో మరిన్ని కఠిన నిర్ణయాలు ప్రకటించనున్నారు

# ఎపిలో మరో కరోనా పాజిటివ్ కేసు నమోదు

### తాజాగా కర్నూలులో ఓ వ్యక్తి మృతి
### మొత్తం 304కు చేరిన కేసుల సంఖ్య
### నాలుగుకు చేరిన మరణాల సంఖ్య
### విజయవాడలో కఠినంగా లాక్‌డౌన్ ఆంక్షలు
### కాణిపాకంపై ప్రచారాలను ఖండించిన ఇవో

అమరావతి,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లోని మరో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు కేవలం ఒక్క కరోనా కేసు మాత్రమే పాజిటివ్‌గా తేలిసింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 304కి చేరింది. ఇక జిల్లాల వారిగా అత్యధికంగా కర్నూలులో 74 పాజిటివ్ కేసులు నమోదు కాగా, నెల్లూరులో 42, గుంటూరు 33, కృష్ణా 29, వైఎస్సార్ జిల్లాలో 27, విశాఖపట్నం 20, పశ్చిమ గోదావరి 21, చిత్తూరు 17, తూర్పు గోదావరి 11, ప్రకాశం 24, అనంతపురంలో 6 కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ బులిటిన్‌ను విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో పెరుగుతున్న కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. మొత్తం 74 పాజిటివ్ కేసులు నమోదు చేశారు. 74లో 73 కేసులు మర్కజ్ బాధితులవేనని అధికారులు తెలిపారు. కర్నూలు నగరంలో 20, నంద్యాల 23, ఆత్మకూరు 4, పాణ్యం 4, బనగానపల్లి 4, నందికొట్కూరు 3 కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాలను జిల్లా ఎస్పీ రెడ్‌జోన్‌గా ప్రకటించారు. కర్నూలు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి(45) కరోనాతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో రాష్ట్రంలో కరోనా మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. గుంటూరు జిల్లాలో కొత్తగా కరోనా పాజిటివ్ కేసు నమోదైనట్లు వైద్యులు వెల్లడించారు. ఈ క్రమంలో కరోనా బాధితుల సంఖ్య 304కు చేరింది. ఇక జిల్లాల వారీగా అనంతపురంలో 6, చిత్తూరులో 17, తూర్పు గోదావరిలో 11, గుంటూరులో 33, కడప 27, కృష్ణ 29, కర్నూల్ 74, నెల్లూరు 42, ప్రకాశం 24, విశాఖపట్నం 20, పశ్చిమ గోదావరిలో 21 కేసులు నమోదయ్యాయి. వీరిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారు. విజయవాడలో లాక్‌డౌన్ కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నట్లు నగర మునిసిపల్ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కరోనా వైరస్ భారీగా వ్యాపిస్తున్న నేపథ్యంలో మంగళవారం నుంచి ఆ ఆంక్షలు అమల్లోకి వచ్చాయని ఆయన వెల్లడించారు. ప్రజలకు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు మాత్రమే రోడ్ల మీదకు అనుమతి ఇస్తామని అన్నారు. పచారి షాపులు, పండ్ల మార్కెట్, రైతు బజార్లు, కాళేశ్వరరావు మార్కెట్‌కి మాత్రమే ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు తెరిచి ఉంటాయని చెప్పారు. ఉదయం 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పాలు, డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

ఇక ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు ఏటీఎం ఫిల్లింగ్ వెహికిల్స్‌కు అనుమతి ఇస్తామని, ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు టెక్ అవే హోటల్స్‌కు అనుమతి ఉంటుందని మునిసిపల్ కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ, పోలీస్, ఫైర్, ఎలక్ట్రిసిటీ, రెవిన్యూ, వీయంసీ, మెడికల్ ,హెల్త్ డిపార్ట్‌మెంటు వెహికల్స్‌కు మాత్రమే అన్ని వేళ్లలో అనుమతి ఇస్తామని వెల్లడించారు. ఇక.. ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా వెహికల్స్‌కు, ఆయిల్, గ్యాస్ ఫిల్లింగ్ వెహికల్స్, మొబైల్ కమ్యునికేషన్స్ వెహికల్స్‌కు ప్రత్యేక అనుమతి ఉంటుందని చెప్పారు. వ్యాపార సంస్థలకు లాక్‌డౌన్ పూర్తయ్యే వరకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆటోనగర్ కూడా లాక్ డౌన్ అమలు చేస్తుందని అన్నారు. ఇక, ప్రజలు గుమిగుడినా, నిబంధనలను అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు చేయొద్దు.. చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నా ఎవరూ వినని పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ప్రసిద్ధ కాణిపాకం క్షేత్రంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుష్ప్రచారం జరుగుతోంది. కాణిపాకం ఆలయాన్ని ఐసోలేషన్ వార్డుగా మార్చారని చేస్తున్న ప్రచారాన్ని ఆలయ అధికారులు తిప్పికొట్టారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో కనిపిస్తున్న దేవాలయం కాణిపాకం వినాయక స్వామి దేవాలయం కాదు. అది కాణిపాకంలో ఉన్న శ్రీ గణేళిష్ సదన్ అనే నివాస కేంద్రం. ఆ నివాస కేంద్రాన్ని క్వారంటైన్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపయోగిస్తుంది. కావున వైరల్ అవుతున్న పోస్టు తప్పు అని ఇవో స్పష్టం చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# జిల్లాలో పకడ్బందీగా లాక్‌డౌన్ అమలు

### పాజిటివ్ కేసు నమోదుతో అధికారుల అప్రమత్తం
### పాజిటివ్ వచ్చిన వ్యక్తి కలిసిన వారిని గుర్తించాలని ఆదేశాలు
### మీడియాతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో లాక్‌డౌన్ పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు.ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారిని ఐసోలేషన్‌లో పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు. ఖమ్మం పెద్దతండాలో కరోనా సోకిన వ్యక్తికి ఎలాంటి లక్షణాలు లేకుండానే పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని వెల్లడించారు. దగ్గు, జలుబు, జ్వరం లాంటి లక్షణాలు ఏమీ అతనికి లేవని, టీబీ పేషెంట్ కావడంతో వైద్యులు అప్రమత్తంగా ఉండి చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వేరే ప్రాంతాలకు వెళ్లొచ్చిన వ్యక్తుల ద్వారానే కరోనా సోకిందని వివరించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తి కలిసిన వారిని గుర్తించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఎవరికైనా కరోనా లక్షణాలు ఉంటే డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకురావాలని సూచించారు. లాక్‌డౌన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని ప్రజలకు సూచించారు. సరైన కారణం లేకుండా రోడ్లపైకి వచ్చే వారి వాహనాలను సీజ్ చేయాలని పోలీసులను ఆదేశించారు. కరోనా కట్టడికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని మంత్రి కోరారు. కరోనా వైరస్ వ్యాప్తిని జిల్లాలో అరికట్టేందుకు చేపట్టిన చర్యలను భవిష్యత్తులో ఇదేవిధంగా కొనసాగించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. లాక్‌డౌన్‌ను మరింత పటిష్టం చేయాలన్నారు. జిల్లాలో ఒక్క పాజిటివ్ కేసు నమోదు కాకపోవడంతో అధికార యంత్రాంగం చేసిన కృషిని మంత్రి అభినందించారు. ఇదే స్ఫూర్తితో అధికారులు కరోనాను కట్టడి చేయాలన్నారు. జిల్లా సరిహద్దులో ఆంధ్ర రాష్ట్రంలో పరిస్థితి తీవ్రంగా ఉన్నందున మన జిల్లా సరిహద్దు ప్రాంతాల గ్రామాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు కొత్తగా వచ్చిన వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. గతంలోనూ వచ్చిన వారిపై నిఘా పెట్టాలని మంత్రి చెప్పారు. మరో నెలరోజులపాటు ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వరాదని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాకు ఇప్పటి వరకు విదేశాల నుంచి వచ్చిన, ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లివచ్చిన, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను మంత్రి సమీక్షించారు.

## సర్వేకు వెళ్లిన ఆశావర్కర్లపై దాడి
### ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

వికారాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): తాండూరు మున్సిపాలిటీలోని పాత తాండూర్‌లో ఈ రోజు ఆశా వర్కర్లు మెడికల్ సర్వే నిర్వహించడానికి వెళ్లారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ ఆరోగ్య వివరాలు అడుగుతుండగా కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇక్కడ ఎందుకు సర్వే చేస్తున్నారంటూ ఆశావర్కర్లపై దాడికి యత్నించారు. అక్కడి నుంచి వెనుదిరిగిన ఆశావర్కర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీకి చేరుకున్న పోలీసులు ఆశావర్కర్లను బెదిరించిన ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల రక్షణలో ఆశావర్కర్ల సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వానికి సహకరించకుండా మెడికల్ సిబ్బందిపై దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై హెచ్చరించారు.

## వ్యక్తిగత రక్షణపరికరాల ఉత్పత్తిని పెంచిన రైల్వే

హైదరాబాద్, ఏప్రిల్ 7: కరోనాపై పోరాడుతున్న వైద్యసిబ్బందికి అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాల ఉత్పత్తిని రైల్వేశాఖ అధికంచేసింది. ప్రస్తుతం రైల్వేలోని వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కోసం వ్యక్తిగత రక్షణ పరికరాల తయారుచేస్తున్నది. అయితే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రైల్వే భోగీలను ఐసోలేషన్ వార్డులుగా మారుస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది రక్షణ పరికరాల ఉత్పత్తిని పెంచాలని నిర్ణయిచింది. ఇప్పటివరకు రోజుకు వెయ్యి వరకు పీపీఈలను ఉత్పత్తి చేస్తున్నది. కాగా, మొత్తం వైద్యసిబ్బందికి అవసరమైన పీపీఈల్లో 50 శాతం సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ మేరకు మొదట ఉత్తర రైల్వే వర్క్‌షాపులో పరికరాల తయారీని అధికారులు ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఉన్న 17 వర్క్‌షాపుల్లో పరికరాలను ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు.

## వరంగల్‌లో కొత్త కేసులు నమోదు కాలేదన్న అధికారులు
### పారిశుధ్య కార్యక్రమం చేపట్టిన మేయర్

వరంగల్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): వరంగల్‌లో కొత్తగా కరోనా పాజిటివ్ కేసులు నమోదుకాలేదని డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. తాజాగా 35 మంది నమూనాలను కరోనా పరీక్షలకు పంపామని, అందులో నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా నుంచి ఢిల్లీలోని మర్కజ్‌లో జరిగిన తబ్లిగీ జమాత్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారి కుటుంబీకుల నమూనాలను పరీక్షలకు పంపించామని ఆమె వెల్లడించారు. ఇకపోతే

కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు వరంగల్ మేయర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యాలయానికి వచ్చినవారు బయట కాళ్లు, చేతులు కడుక్కొని లోపలికి వేళ్లాలా ఏర్పాటు చేశారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుభ్రపరిచే చర్యలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మేయర్ ప్రకాష్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కాశిబుగ్గలో డ్రోన్స్ ద్వారా సోడియం హైడ్రోక్లోరైడ్ స్ప్రే చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో 15 ప్రాంతాలను నో మూమెంట్ జోన్లుగా ప్రకటించామన్నారు. ఈ 15 ప్రాంతాల్లో ప్రజలు పూర్తి స్థాయిలో బయటకు రాకుండా నియంత్రించామన్నారు. వారికి నిత్యావసర వస్తులు అందజేస్తున్నామని మేయర్ తెలిపారు.

## మూగజీవాలకు ఆహారం అందించిన రష్మి

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రస్తుత విపత్కర పరిస్థితిలో మూగ జీవాలను గురించి పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. దీంతో అవి ఆహారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా వీధి కుక్కలు తినడానికి ఏమీ దొరక్క ఆకలితో అలమటిస్తున్నాయి. వీటి దుస్థితికి బుల్లితెర హాట్ యాంకర్ రష్మీ గౌతమ్ చలించిపోయింది. తానే స్వయంగా రంగంలోకి దిగి కొన్ని కుక్కలకు ఆహారం, నీళ్లు అందించింది. అందరూ సమీపంలో ఉన్న మూగ జీవాలకు ఆహారం అందించాలని విజ్ఞప్తి చేసింది.

## విశాఖలో చికెన్ వ్యాపారికి కరోనా
### చికెన్న కొన్న వారికోసం పోలీసులు ఆరా

విశాఖపట్నం,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం గాజువాకలోని కుంచమాంబ కాలనీకి చెందిన 30ఏండ్ల చికెన్ వ్యాపారికి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయింది. దీంతో అతని షాపులో చికెన్ కొనుగోలు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారి చాలా మందికి చికెన్ విక్రయించాడు. సోమవారం ఉదయం వరకు ఈ యువకుడు చికెన్ విక్రయాలను చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆదివారం అతడి చికెన్ షాపు జనంతో కిక్కిరిసిపోయింది. కరోనా సోకిన వ్యక్తి ఈనెల 22న విదేశాల నుంచి వచ్చాడు. కుంచమాంబ కాలనీకి మూడు కిలోమీటర్ల పరిధిలో కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించినట్లు పోలీసులు తెలిపారు. విశాఖ నగరంలో ఇప్పటి వరకు 18 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు అతని వద్ద చికెన్ కొనుగోళ్లు చేసిన వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పోలీసులు కోరారు. ఈ మేరకు పోలీసులు విశాఖలో ప్రచారం చేపట్టారు.

## కరోనా సేవలపై నోరు పారేసుకున్న అసోం ఎమ్మెల్యే
### తీవ్రంగా పరిగణించి అరెస్ట్ చేసిన ప్రభుత్వం

గౌహతి,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): అసోంలో కరోనా రోగుల కోసం నిర్వహిస్తున్న వైద్యకేంద్రాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విపక్ష ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాంను అరెస్టు చేశారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కరోనా రోగుల క్వారంటైన్ కేంద్రాలు డిటెన్షన్ కేంద్రాల కన్నా దారుణంగా ఉన్నాయని ఎఐయూడీఏకు చెందిన ఇస్లాం విమర్శించినట్టుగా వార్తలు వచ్చాయి. అసోంలోని క్వారంటైన్ కేంద్రాలు ప్రమాదకరంగా ఉన్నాయని, అక్రమ వలసదారుల కోసం నిర్మించిన డిటెన్షన్ కేంద్రాలకంటే అవి దారుణమని ఆయన మరొకరితో అన్నట్టుగా చెప్తున్న ఆడియో బయటకు వచ్చింది. అసోంలోని బీజేపీ సర్కారు ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రపన్నిందని, ఢిల్లీ మతసభలో పాల్గొని వచ్చినవారిని వైద్యసిబ్బంది వేధిస్తున్నారని, ఆరోగ్యంగా ఉన్నవారికి కూడా ఏవో ఇంజక్షన్లు ఇచ్చి రోగులుగా చూపుతున్నారని విపక్ష ఎమ్మెల్యే అన్నట్టుగా అందులో ఉంది. సోమవారం రాత్రి ఆయనను అదుపులోకి సతీసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం కేసు నమోదు చేశారు. గతంలోనూ ఈ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి.

# గద్వాల జిల్లాలో తాజాగా 11మందికి కరోనా



జోగులాంబ గద్వాల,ఏప్రిల్7 (ఆర్ఎన్ఎ): జిల్లాలో కొత్తగా కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 7 కేసులు గద్వాల టౌన్‌లో, మరో రెండు కేసులు రాజోలు మండల కేంద్ర నుంచి నమోదయ్యాయి. వీరందరూ ఢిల్లీ వెళ్లి వచ్చిన వారిగా గుర్తించారు. వీటితో కలుపుకుంటే జిల్లాలో మొత్తం 22 కేసులు నమోదయ్యాయి. గద్వాల పట్టణంలో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారు. గద్వాల మున్సిపల్ సిబ్బంది కాలనీల్లో సానిటేషన్ పనులను ముమ్మరం చేశారు. మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. సామాజిక దూరం పాటించి వైరస్ నుంచి రక్షించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్లను వికేంద్రికరించి ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజురోజుకు 1పెరుగుతున్న కరోనా వైరస్ పాజిటివ్ కేసులతో గద్వాల జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సోమవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 11 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. మంగళవారం ఒక్కరోజే మరో ఎనిమిది కేసులు వెలుగుచూశాయి. దీంతో జిల్లాలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 19కి చేరింది. ఒక్క రోజే ఎనిమిది కేసులు నమోదు కావడంతో గద్వాల ఉలిక్కిపడింది. ఈ ఎనిమిది మందిలో ఏడుగురు గద్వాల పట్టణానికి చెందిన వారే కావడం గమనార్హం. రాజోలి మండలంలో మరొకరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

### ఉలిక్కి పడుతున్న జిల్లా వాసులు

ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు, జోగులాంబ గద్వాల జిల్లాలో 19, నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు చొప్పున మొత్తం 28 కేసులు నమోదయ్యాయి.

తాజా కేసులతో ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లా అధికారుల్లో ఆందోళన నెలకొంది. వారం రోజుల క్రితం వరకు ప్రశాంతంగా ఉన్న జోగులాంబ గద్వాల జిల్లా ఇప్పుడు కరోనా పేరు వింటేనే ఉలికిపడుతోంది. ఢిల్లీలో జరిగిన ధార్మిక సభలో ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొన్న 127 మందిలో 71మంది గద్వాల జిల్లాకు చెందిన వారే ఉన్నట్లు గుర్తించిన అధికారులు వారి వివరాలు తెలుసుకుని ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్ కేంద్రాలకు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే గద్వాలకు చెందిన ఓ వ్యక్తి కరోనా పాజిటివ్‌తో చనిపోవడం.. తాజాగా మరో ఎనిమిది మందికి పాజిటివ్ రావడంతో ఆ జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

## కరోనా వైరస్ మహమ్మారిపై తెలంగాణ ప్రభుత్వం పోరు
### -అందుబాటులోకి వాట్సాప్ చాట్‌బాట్

హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారిపై పోరుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తున్నది. సోషల్‌మీడియా వేదికలనూ సమర్థంగా ఉపయోగించుకుంటున్నది. కోవిడ్-19 నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పౌరులకు తెలియజేసేందుకు వాట్సాప్ చాట్‌బాట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. చాట్‌బాట్ ద్వారా వివరాలు తెలుసుకోవాలనుకునే లింక్‌ను క్లిక్ చేయడంతో కుటుంబసభ్యులు, సన్నిహితులతో పంచుకోవడానికి ఈ సందేశాన్ని ఫార్వర్డ్ చేయండి. తెలంగాణ ప్రభుత్వ కరోనా (కోవిడ్-19) వాట్సాప్ చాట్ బాట్ కి స్వాగతం! కరోనా వైరస్ గురించి ప్రాథమిక సమాచారం, దాని నుండి సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ మహమ్మారిని ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న సమాచారం, సేవలను ఈ చాట్ బాట్ ద్వారా తెలుసుకోవచ్చు. అని సందేశం వస్తుంది.

## జీ20 దేశాలకు ప్రపంచ ప్రముఖుల పిలుపు

అమెరికా, ఏప్రిల్ 7:ప్రపంచాన్ని స్తంభింపజేసిన కరోనాను పూర్తిగా రూపుమాపేందుకు జీ20 దేశాలే పూనుకోవాలని ప్రపంచంలోని పలువురు మాజీ దేశాధినేతలు, వీఐపీలు, సెలబ్రిటీలు కోరారు. కొన్ని దేశాల్లో కరోనా తగ్గి మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో రెండోసారి కరోనా ప్రపంచాన్ని నాశనం చేయకుండా కలిసికట్టుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం 8బిలియన్ డాలర్ల నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. కరోనాకు వీలైనంత త్వరగా వ్యాక్సిన్‌ను తయారుచేయాలని జీ20 దేశాధినేతలకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్‌తోపాటు 165 మంది ప్రముఖులు సంతకాలు చేశారు. వీరిలో 92 మంది మాజీ దేశాధినేతలు, కొందరు ప్రస్తుత అధ్యక్షులు, ప్రధానులు ఉన్నారు. పేద దేశాల్లో సరైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు కనీసం 150 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని లేఖలో పేర్కొన్నారు.

## భారీ లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

ముంబై, ఏప్రిల్ 7: స్టాక్‌మార్కెట్ భారీ లాభాలతో ముగిసింది. బ్యాంకింగ్, ఫార్మా షేర్లు బాగా లాభపడటంతో సెన్సెక్స్

2476 పాయింట్లకుపైగా పెరిగి 30,067.21కు చేరింది. అదేవిధంగా 702 పాయింట్లకుపైగా పెరిగిన నిఫ్టీ 8,785.26 పాయింట్లతో ముగిసింది. అదేవిధంగా రూపాయి కొద్దిగా కోలుకుని 49 పైలు బలపడింది. దీంతో అమెరికా డాలర్‌తో రూపాయి మారక విలువ 75.64కు చేరింది. హైదరాబాద్ మార్కెట్‌లో 22 కారెట్ల బంగారం ధర రూ.130 పెరిగి రూ.40,160గా ఉంది. అదేవిధంగా 24 కారెట్ల బంగారం ధర రూ.130 అధికమై రూ. 44,160కు చేరింది.

### నేటి కవిత




Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.